
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

మంగళవారం 26 మార్చి 2024 | 3

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ) సా.6.24

సహరి(బుధ) ఉ.4.42

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	39.0	22.0

ఎలక్షన్ నిఘా



- సీ-విజిల్ యాప్‌లో 182 ఫిర్యాదులు
- పలుచోట్ల నగదు.. మద్యం స్వాధీనం
- ఎన్‌కోర్ ద్వారా 115 దరఖాస్తులు..
- 61కి ఆమోదం.. 33 తిరస్కరణ
- జిల్లా కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణ వ్యవస్థ అమలులో భాగంగా సీజర్ (స్వాధీనం), ఎన్‌కోర్ మేనేజ్మెంట్ (అనుమతులు), సీ విజిల్ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఇప్పటికే మంచి ఫలితాలు వస్తున్నాయని జిల్లా ఎన్నికల అధికారి డా. కె.మాధవీలత ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటికే సీ విజిల్ ద్వారా ఆదివారం అర్ధరాత్రి వరకూ 182 ఫిర్యాదులు అందాయని, సోమవారం రాజమహేంద్రవరం రూరల్‌లో 2, నిడదవోలు నుంచి ఒక ఫిర్యాదు వచ్చిందన్నారు. రూ.50 వేలు కంటే ఎక్కువ అనధికార నగదు తీసుకుని వెళ్లకూడదనే నిబంధనతో జిల్లాలో ఇప్పటి వరకూ నిర్వహించిన తనిఖీలలో నిడదవోలు నియోజకవర్గంలో ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.2 లక్షలు, రూ.లక్షా 14వేలు, రూ.6 లక్షల 30 వేలు మొత్తం రూ.9 లక్షల 44 వేలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆధారాలు చూపించడం వల్ల రూ.3 లక్షల 14 వేలు తిరిగి ఇచ్చినట్టు చెప్పారు. ఎక్సైజ్ పోలీసు శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని ఏడు చెక్‌పోస్టుల వద్ద జరిగిన తనిఖీలలో రూ.లక్షల విలువైన మద్యం దొరికిందన్నారు. జిల్లాలో 63 వివిధ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయన్నారు. ఎక్సైజ్, పోలీసు శాఖ నిర్వహించిన 65 దాడులలో రూ.9 లక్షల 14 వేల ఖరీదైన 3047 లీటర్ల మద్యం దొరికిందని, 72 మందిని అరెస్ట్ చేశామన్నారు. రూ.లక్షా 69వేల ఖరీదైన 33 వేల 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్టుచెప్పారు. అనధికార బెల్ట్ షాపులలో డ్యూటీ పెయిడ్ మద్యం అమ్ముతున్న 95 మందిపై కేసులు నమోదు చేసి, 2,27,183 విలువైన 672 లీటర్ల మద్యం సీజ్ చేసినట్టు చెప్పారు. గంజాయికి చెందిన మూడు దాడుల్లో 5 మందిని అరెస్ట్ చేసి, రూ.3,61,550 విలువైన సుమారు 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసు కున్నామన్నారు.

ఎన్‌కోర్ మేనేజ్‌మెంట్ విధానంలో

ఎన్‌కోర్ మేనేజ్‌మెంట్ విధానంలో సింగిల్ విండోలో సువిధ యాప్ ద్వారా వస్తున్న దరఖాస్తులను మార్గదర్శకాల మేరకే అనుమతులు ఇస్తున్నట్టు మాధవీలత తెలిపారు. సక్రమంగా లేని వాటిని తిరస్కరిస్తున్నామన్నారు. 48 గంటలలో అనుమతులు ఇస్తున్నట్టు చెప్పారు. రాజకీయ పార్టీలు అనుమతి కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో అవసరమైన ధ్రువ పత్రాలన్నీ పొందుపరచాలని సూచించారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్‌కోర్ ద్వారా 115 అభ్యర్థనలు రాగా, 61కి అనుమతి ఇచ్చి, 33 తిరస్కరించామని, 7 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనపర్తిలో 11 దరఖాస్తుల్లో 10 ఆమోదం పొందగా, ఒకటి తిరస్కరించారు. రాజానగరంలో 37కి 22ని ఆమోదించి 14 తిరస్కరించారు. ఒకటి పెండింగ్‌లో ఉంది. రాజమండ్రి సిటీ నుంచి 30 దరఖాస్తులు రాగా, 7 ఆమోదం పొందగా 11 తిరస్కరించారు. ఆరు పరిశీలనలో ఉండగా, 6 పెండింగ్‌లో ఉన్నాయి. రాజమండ్రి రూరల్‌లో 4రాగా మూడు ఆమోదం పొందాయి. ఒకటి తిరస్కరించారు. కొవ్వూరులో 7 రాగా, 5కి ఆమోదం తెలిపి, 2 తిరస్కరించారు. నిడదవోలులో 17రాగా, 10కి ఆమోదం తెలిపి ఏడింటిని పరిశీలిస్తున్నారు. గోపాలపురంలో 9 రాగా 4 ఆమోదించారు. 4 తిరస్కరించారు. 1 పరిశీలనలో ఉన్నట్టు చెప్పారు. ప్రచారం కోసం గోడలమీద ఎటువంటి రాతలు రాయకూడదని, కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ మాధవీలత హెచ్చరించారు. ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యాల ప్రజా ప్రాతినిధ్య చట్టం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. ప్రచురణలకు సంబంధించి మూడు రోజులలో ఆర్వోలకు నివేదికలు పంపాలన్నారు.

డ్రెడ్జింగ్ ముప్పు



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)



అఖండ గోదావరిలో ఇసుక అక్రమాలు, ఇసుక డ్రెడ్జింగ్ వల్ల గోదావరి వంతెనలకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. గామన్ బ్రిడ్జి కొంత కుంగడానికి బ్రిడ్జి సమీపంలో ఇసుక తవ్వకాలు చేయడం ఒక కారణమా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కూడా రోడ్ కమ్ రైలు బ్రిడ్జి, రైల్వే ఆర్చి వంతెన విషయంలో ఢిల్లీ నుంచి వచ్చిన నిపుణులు హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. వంతెనలకు దగ్గరలో ఇసుక తవ్వకాలు చేయడం వల్ల వంతెనకు ముప్పు వాటిల్లుతుందని కూడా గతంలో హెచ్చరించారు. అనేక జాగ్రత్తలు చెప్పారు. కానీ అధికారులు నిబంధనలు ఆచరణలో పెట్టడం లేదు. నిపుణులు హెచ్చరించినప్పటికీ గోదావరి బ్రిడ్జిల సమీపంలో తవ్వకాలు ఆగడం లేదు.



- గోదారిలో యథేచ్ఛగా ఇసుక డ్రెడ్జింగ్
- అనుమతులు మీరి లోతైన తవ్వకాలు
- అన్ని కార్యకలాపాలు నిబంధనలకు విరుద్ధంగానే..
- గోదావరి బ్రిడ్జిలకు పెనుముప్పు
- నిపుణులు హెచ్చరించినా ఆగని తవ్వకాలు
- గామన్ బ్రిడ్జి కుంగడం వెనుక ఇదే కారణమా?

కోడ్ అమల్లోకి వచ్చినా..

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా అధికారులు ఇంకా వైసీపీ సేవలోనే నిమగ్నమయ్యారు. వైసీపీ అధిష్ఠానానికి భయపడి కళ్ల ఎదుటే అక్రమాలు, దోపిడీ జరుగుతున్నా మౌనం వహిస్తున్నారు. ఇసుక అక్రమాలు ఆపడం కోసం ఫిబ్రవరి 17వ తేదీని జిల్లా కలెక్టర్ ఐదుగురు సభ్యులతో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ టాస్క్ ఫోర్స్ సభ్యులు ఏమయ్యారో, ఏమి చేస్తున్నారో కానీ, ఇసుక అక్రమాలను ఆపలేకపోతున్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో ఎస్ఈబీ, మైన్స్, ఇరిగేషన్, పోలీసు, రెవెన్యూ అధికారులతో ఈ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదే శించారు. గోదావరిలో అక్రమంగా డ్రెడ్జింగ్ జరిగిపోతోంది. గాయత్రి, కాతేరు, కోటిలింగాల, కొవ్వూరు డివిజన్ పరిధిలోనూ అనధికారికంగా డ్రెడ్జింగ్‌తో రోజుకే వేలాది టన్నులు ఇసుక తవ్వేస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఇసుక తీసి, ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. భద్రతా చర్యలలో భాగంగా బ్యారేజీ, రోడ్ కమ్ రైలు బ్రిడ్జి, రైలు వంతెనలకు 500 మీటర్ల లోపు తవ్వకాలు నిషేధమని అధికారులు ప్రకటించారు. హద్దులు ఏర్పాటు చేసి బారికేడ్లు ఏర్పాటు చేస్తామన్నా ఎవరూ పట్టించుకోలేదు.

నిపుణులు హెచ్చరించినా..

రోడ్ కమ్ రైలు బ్రిడ్జి మీద నుంచి ఇప్పటికే భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీని లైఫ్ దాదాపు అయినట్టు అప్పట్లో ప్రకటించారు. కొంత మేర రిపేర్లు చేసి, రోడ్డు వేసి ఆర్టీసీ ఆర్డినరీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. రైల్వే నిపుణులు పరిశీలించి, బ్రిడ్జి పూర్తి రిపేర్లకు సిఫార్సు చేస్తారని కూడా అప్పట్లో ప్రకటించారు. అవేమీ అమలులోకి రాలేదు. ఎన్ని నిబంధనలు విధించినా తవ్వకాలు ఆగడం లేదు. అధికారులూ పట్టించుకోవడం లేదు. వాస్తవంగా గోదావరిలో నీటి నిల్వ పెంచడం కోసం డ్రెడ్జింగ్ చేస్తే బ్యారేజీకి మూడు కిలోమీటర్ల వరకూ ఎటువంటి తవ్వకాలు జరగకూడదు. అంతే కాక గోదావరి రోడ్డు కం రైలు బ్రిడ్జి, రైలు బ్రిడ్జి వైపు అప్‌స్ట్రీమ్‌లో ఎగువ వైపు 500 మీటర్లు, దిగువ ప్రాంతంలో 300 మీటర్ల వరకూ డ్రెడ్జింగ్ చేయకూడదు. ఎటువంటి ఇసుక తవ్వకాలు జరగకూడదు. ఇది నిబంధన. అంతేకాక గతంలో నిపుణుల కమిటీ కూడా ఇక్కడ ఇసుక తవ్వితే బ్రిడ్జిలకు ప్రమాదమని హెచ్చరించిన సంగతి తెలిసిందే. కానీ ఎక్కడా నిబంధనలు పాటించడంలేదు.



ఇష్టానుసారం తవ్వేస్తున్నారు..

గోదావరిలో ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. రాత్రీ పగలూ ఒకటే పని. ఇది ఏ ప్రమాదానికి దారితీస్తుందోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పైగా డ్రెడ్జింగ్ ఒక పద్ధతి ప్రకారం జరగాలి. పెద్ద డ్రెడ్జర్లతో పని జరగాలి. ప్రస్తుతం వందవరకూ డ్రెడ్జింగ్ బోట్లతో తవ్వేస్తున్నారు. ప్రభుత్వం ఒప్పందం పొందిన కాంట్రాక్టు సంస్థ ఇసుక తవ్వినా గామన్ బ్రిడ్జి అవతల అనుమతి లేదు. కానీ కాతేరు, వెంకటనగర్, తాళ్లపూడి వైపు ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. గామన్ బ్రిడ్జికి ఇవతల 800 మీటర్ల వరకూ తవ్వకూడదనే నిబంధన ఉంటే, సమీపంలోనే తవ్వేస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇటీవల గామన్ బ్రిడ్జి 52 పిల్లర్ వద్ద కొద్దిగా కుంగడంతో బేరింగ్‌లు దెబ్బతిన్నాయా? స్ప్రింగ్ దెబ్బతిందా?? అని ఆరా తీస్తూ ప్రస్తుతం కొవ్వూరు వైపు రాజమహేంద్రవరం వైపు వచ్చే బ్రిడ్జి ఎడమ వైపు వాహనాలు ఆపేశారు. రాజమహేంద్రవరం వైపు నుంచి కుడి వైపు సింగిల్ దారిలోనే వాహనాల రాకపోకలు అనుమతిస్తున్నారు. బ్రిడ్జి సడెన్‌గా కుంగిపోవడంతో ప్రస్తుతం ఇసుక అక్రమ తవ్వకాలు, డ్రెడ్జింగ్ కూడా చర్చనీయాంశమైంది. ఈ బ్రిడ్జి నిర్వహణ కూడా బాగా లేదు. టోల్ ప్లాజా ఎక్కువ డబ్బు మాత్రం గుంజేస్తున్నారు. దివాన్ చెరువు నుంచి కొవ్వూరు టోల్ ప్లాజా వరకూ రోడ్డు మధ్యలో గాళ్లు కింద ఏర్పడింది. తారు, ఇతర మెటీరియల్ అటూ ఇటూ జరిగిపోవడం వల్ల మధ్యలో లోతైన గాడి ఏర్పడింది. ఇలా అనేక గాడులు ఏర్పడ్డాయి. రోజూ వెళ్లేవాళ్లు జాగ్రత్తలు తీసుకున్నా, భారీ వాహనాలు వచ్చే సమయంలో వాహనాలు ఈ గోతులలో నుంచి పైకి ఎక్కి తప్పించుకునే అవకాశాలు తక్కువ. గత ఏడాది నుంచి ఇదే పరిస్థితి ఉన్నా, చిన్నచిన్న రిపేర్లు తప్ప ఈ రోడ్డును పట్టించుకోవడంలేదు.

నిబంధనలకు విరుద్ధం..

డ్రెడ్జింగ్ ఒప్పందం ప్రకారం ధవళేశ్వరం బ్యారేజి నుంచి గామన్ బ్రిడ్జికి 800 మీటర్ల లోపు వరకూ మొత్తం కోటి 70 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక డ్రెడ్జింగ్ చేయాలి. దీని కోసం క్యూబిక్ మీటరుకు రూ.155 వంతన ప్రభుత్వం సదరు కాంట్రాక్టు సంస్థకు చెల్లించాలి. అంటే మొత్తం రాజమహేంద్రవరం వైపు డ్రెడ్జింగ్ చేయడానికి రూ. 144 కోట్లు, కొవ్వూరు వైపు డ్రెడ్జింగ్ చేయడానికి రూ.124 కోట్ల కాంట్రాక్టర్‌కు ఇవ్వడానికి ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ఈ కాంట్రాక్టర్ పెద్ద డ్రెడ్జర్లు పెట్టి, ఇసుక తిప్పలు తొలగించి, ఇసుకను గోదావరి ఒడ్డున పోగు పెట్టాలి. దానిని వేరేవాళ్ల చేత ప్రభుత్వం అమ్మించి డబ్బు చేసుకుంటుంది. డ్రెడ్జింగ్ వల్ల గోదావరిలో నీటి నిల్వ శాతం పెరగాలనేది లక్ష్యం. కానీ ఇక్కడ ఎంత ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారో చెప్పడానికి కాంట్రాక్టర్ ఎవరూ కనిపించరు. డ్రెడ్జింగ్ చేసిన ఇసుక ప్రత్యేకంగా ఎక్కడా పోగులు పెట్టినట్టు లేదు. గతంలో డ్రెడ్జింగ్ చేసి వెంటనే అమ్మేసినట్టే ఇప్పుడూ జరుగు తోంది. అధికారికంగా డ్రెడ్జింగ్ చేసిన కాంట్రాక్టరు ప్రత్యేకంగా ఇసుక పోగు చేసి, ఇరిగేషన్ అధికార్లకు గానీ, ఏపీ ఎండీసీకి గానీ అప్పగించాలి. ఇక్కడ ఏమి జరుగుతుందో ఎవరూ స్పష్టత ఇవ్వడంలేదు. గతంలో బోట్స్‌మన్ సొసైటీ పేరిట వైసీపీ నేతలు నడుపుతున్న ర్యాంపులలో కూడా డ్రెడ్జింగ్ కొనసాగుతూనే ఉంది. గాయత్రి ర్యాంపులు, కోటిలింగాల ర్యాంపులు, కాతేరు, వెంకటనగర్ ర్యాంపులు, కొవ్వూరులో కూడా డ్రెడ్జింగ్ జరుగుతోంది.

అనపర్తి లొల్లి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- సీటు బీజేపీకి కేటాయిస్తే సహాయ నిరాకరణే అంటున్న క్యాడర్
- ఇప్పటికే పార్టీ పదవులకు రాజీనామా చేసిన లీడర్లు
- ప్రచారం ఆపేసి,ఇంటికే పరిమితమైన రామకృష్ణారెడ్డి
- తీవ్ర ఆగ్రహంతో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు
- బలం లేని బీజేపీకి ఇస్తే టీడీపీలో ఉండలేమని ప్రకటన
- క్యాడర్‌కు నచ్చచెబుతున్న సీనియర్ నేతలు

తెలుగుదేశం- జనసేన- బీజేపీ పొత్తు కుదుర్చుకుని మంచి జోష్‌లో ఉన్న సమయంలో అనపర్తి టికెట్ తలనొప్పిగా మారింది. టీడీపీ తొలి జాబితాలోనే అనపర్తి నుంచి టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరును ప్రకటించిన సంగతి తెలిసిందే. తర్వాత బీజేపీతో టీడీపీ-జనసేనకు పొత్తు కుదరడంతో బీజేపీకి కొన్ని స్థానాలు ఇవ్వాల్సి వచ్చింది. అందులో జిల్లాలో ఇప్పటికే రాజమహేంద్రవరం లోక్‌సభను బీజేపీకి కేటాయించారు. అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి ఖరారయ్యారు. కానీ బీజేపీ మరో అసెంబ్లీ సీటు కోరడంతో పాటు అనపర్తిని అడగడంతో ఇప్పటికే అక్కడ టీడీపీ అభ్యర్థిగా ప్రచారంలో నిమగ్నమైన మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి ఇబ్బందిగా మారింది. కానీ ఇంతవరకూ తెలుగుదేశం పార్టీ నుంచి ఆయన సీటు మార్చుతున్నట్టు సమాచారం ఏమీ లేదు. దీంతో ఆయన ఇంతవరకూ ఏమీ పట్టించుకోకుండా ప్రచారం చేసుకుంటున్నారు. కానీ బీజేపీ అధినాయకత్వం తీసుకున్న అసెంబ్లీ స్థానాలలో అనపర్తి కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతుండడంతో పాటు అక్కడ రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజును పోటీ చేయమని అధిష్ఠానం చెబుతున్నట్టు కూడా ప్రచారం జరుగుతోంది. కానీ తాను అసెంబ్లీకి పోటీ చేయనని గతంలోనే స్పష్టం చేయడంతో పాటు, అధిష్ఠానం వద్ద కూడా చెప్పినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన కాదంటే అనపర్తి బీజేపీ ఇన్‌చార్జిగా ఉన్న మిలట్రీ కృష్ణంరాజు పేరును కూడా పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఆదే సమయంలో టీడీపీ అభ్యర్థి రామకృష్ణారెడ్డినే బీజేపీ అభ్యర్థిగా కూటమి తరపున పోటీ పెట్టే ఆలోచన కూడా జరుగుతున్నట్టు సమాచారం. కానీ ఇక్కడ టీడీపీకే బలం ఉందని, బీజేపీకి అసలు బలం లేదని, అందువల్ల బీజేపీకి ఇస్తే తాము టీడీపీలో ఉండలేమని రామకృష్ణారెడ్డి వర్గీయులు బహిరంగంగానే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నియోజకవర్గ స్థాయిలో పార్టీ రాష్ట్ర పదవులు, నియోజకవర్గ పదవులు ఉన్న నేతలంతా రాజీనామాలు చేసి, టీడీపీకి పంపించారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థే ఖరారైతే, రామకృష్ణారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగడానికి కూడా ఆయన అనుచరులు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. దీనితో కూటమికి ఈ సీటు పెద్ద తలనొప్పిగా మారింది.



నల్లమిల్లికే సీటు కేటాయించాలి

● లేకుంటే కఠిన నిర్ణయాలు ● టీడీపీ నేతలు

అనపర్తి, మార్చి 25: అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ సీటును ముందుగా ప్రకటించిన విధంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డిదేనని అధిష్ఠానం స్పష్టమైన ప్రకటన చేయాలని అనపర్తి నియోజకవర్గ టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని జోన్ 2 కార్యాలయానికి సోమవారం చేరుకున్న నియోజకవర్గ నాయకులు కోఆర్డినేటర్ మాజీ మంత్రి సుజయ కృష్ణ రంగారావును కలిసి సీటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సీటు రామకృష్ణారెడ్డికే ఉంటుందని కంగారు పడవద్దంటూ నాయకులను వారించారు. అయితే టీడీపీ నాయకులు అప్పటికే సిద్ధం చేసుకున్న పార్టీ పదవుల రాజీనామా పత్రాలను సుజయకృష్ణ రంగారావుకు అందజేశారు. అనపర్తి సీటు రామకృష్ణారెడ్డికి కేటాయిస్తేనే తాము రాజీనామాలను ఉపసంహరించుకుంటామని లేకుంటే సహాయ నిరాకరణ చేపడతామని అన్నారు. నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, జుత్తుగ కృష్ణ, వెలుగుబంటి సత్తిబాబు, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తమలంపూడి సుధాకరరెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సత్తి దేవదానరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఆళ్ల గోవిందు, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటరామారెడ్డి పార్టీ పదవులకు రాజీనామా చేసినట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందు మాట్లాడుతూ ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసి, 39 కేసులు పెట్టించుకుని, జైలుకు వెళ్లిన రామకృష్ణారెడ్డిని కాదని బీజేపీకి సీటు ఎందుకు కేటాయిస్తారో చెప్పాలని అన్నారు. జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్ని విషయాలు తెలిసిన చంద్రబాబు మౌనం వీడి అనపర్తి సీటుపై క్లారిటీ ఇవ్వాలని అన్నారు.



రాజీనామా పత్రాలను సమర్పిస్తున్న నేతలు



25 శాతం కమిషన్ అంటూ కరపత్రాలు హల్‌చల్

- ఎంపీ భరత్ అవినీతిపై పోస్టర్లు ప్రత్యక్షం
- సోషల్ మీడియాలోనూ వైరల్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25: రాజమహేంద్రవరంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్ లవ్ 25 శాతం కమిషన్ క్యాప్షన్‌తో కొన్ని ప్రాంతాల్లో కరపత్రాలు హల్‌చల్ చేస్తున్నాయి. రాజమహేంద్రవరం ఎంపీగా పని చేసిన భరత్ తన పదవి కాలంలో ఏఏ పనులకు 25 శాతం కమిషన్ తీసుకున్నారో వివరిస్తూ రూపొందించిన ఈ కరపత్రాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. భరత్ రామ్ మునిసిపల్ కాంట్రాక్టులలోను, ఈట్ స్ట్రీట్ ఏర్పాటులోను, కంబాలచెరువు పార్కు అభివృద్ధి పేరుతోను, సుబ్రహ్మణ్య మైదానం అభివృది పేరుతోను, ఇసుక అక్రమ రవాణాలోను, ఆవ భూములు, గ్రావెల్, గ్రానైట్, మాదక ద్రవ్యాల ఎగుమతులలోను భరత్ 25 శాతం కమిషన్ తీసుకున్నారనే అర్థం వచ్చేలా ఈ కరపత్రాలు దర్శనమిస్తున్నాయి. దీంతో కొంతమంది ఈ కరపత్రాలను సోషల్ మీడియాలో సైతం వైరల్ చేస్తున్నారు.

ఎలా జరిగింది?

గామన్‌బ్రిడ్జిపై రెండో రోజు వాహన రాకపోకలు నిలుపుదల.

కుంగిన ప్రాంతాన్ని పరిశీలించిన ఆర్‌డీసీ అధికారులు 7లో



ఓ వైపు వాహనాల నిలుపుదల

బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికార బృందం

కాకినాడ సాగరతీరంలో

ఇండో-యూఎస్ఏ నావికాదళ విన్యాసాలు

7లో

రంప అటవీ శాఖలో ఇంటి దొంగలు

7లో



పిఠాపురం నుంచే పవన్ ఎన్నికల శంఖారావం

7లో

- 30 నుంచి ప్రచారం ప్రారంభం
- మూడు రోజులు అక్కడే
- ఉగాది వేడుకల్లో పాల్గొంటానని వెల్లడి

ఎలా జరిగింది?

- గామన్ బ్రిడ్జిపై వాహన రాకపోకలు నిలుపుదల
- వంతెనను పరిశీలించిన ఆర్‌డీసీ అధికారులు


గామన్ వంతెనపై కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీసీ సిబ్బంది

కొవ్వూరు, మార్చి 25: కొవ్వూరు-రాజమహేంద్రవరం మధ్య అఖండ గౌతమీ గోదావరినదిపై ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ నిర్మించిన నాలుగులైన్ల గ్రామన్ వంతెన కుంగింది. దీంతో వంతెనపై కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలో వాహనరాకపోకలను రెండోరోజు పూర్తిగా నిలుపుదల చేశారు. రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వైపు వచ్చే మార్గంలో మాత్రమే రెండు వైపులా వాహన రాకపోకలను అనుమతిస్తున్నారు. బ్రిడ్జిపై కుంగిన ప్రాంతాన్ని రోడ్డు డెవలప్‌మెంటు కార్పొరేషన్(ఆర్‌డీసీ) అధికారులు సోమవారం పరిశీలించారు. వంతెనపై 50 నుంచి 53వ స్తంభం వరకు అధికారుల బృందం పరిశీలించింది. వాహనాల రాకపోకల సమయంలో వైబ్రేషన్ అధికంగా రావడాన్ని గమనించిన గామన్ బ్రిడ్జి టోల్‌గేట్ నిర్వహణ సిబ్బంది ముందస్తు జాగ్రత్త చర్యగా ఆదివారం సాయంత్రం నుంచి వంతెనపై మరమ్మతులకు గురైన మార్గంలో పూర్తిగా రాకపోకలు నిలుపుదల చేశారు. ఆర్‌డీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీకాంత్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బీఏ వర్మ, కొవ్వూరు సీఐ వి.జగదీశ్వరరావు కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. వంతెనపై నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు రాకపోకలు సాగించడం, వంతెన చెంతనే భారీ యంత్రాలతో ఇసుక డ్రెడ్జింగ్ చేపట్టడంతో వంతెనలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటికే కొవ్వూరు-రాజమహేంద్రవరం పాత రైలు వంతెన (హేవ్‌లాక్ బ్రిడ్జి)ను మూసివేశారు. ఆసియాలోనే పొడవైన వంతెనలలో రెండోదిగా పేరుగాంచిన రోడ్డు కం రైలు వంతెన దీనస్థితికి చేరుకుంది. వంతెనకు ఇటీవల తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కేవలం కార్లు, ద్విచక్ర వాహనాలు, పల్లెవెలుగు ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులకు మాత్రమే రాకపోకలు సాగించేలా అనుమతులు ఇచ్చారు. భారీ వాహనాలతోపాటు, ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నిలుపుదల చేస్తూ ఆంక్షలు విధించారు. మూడు, నాలుగో బ్రిడ్జిలు ఆర్చ్ ఆకారంలో ఉన్న రైలు వంతెన(గామన్ వంతెనలు) గామన్ వంతెనను 2007లో సుమారు రూ.808 కోట్లతో నిర్మాణం ప్రారంభించారు. 2015 గోదావరి మహా పుష్కరాల సమయంలో కొవ్వూరు, రాజమహేంద్రవరంలకు గోదావరి పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా అప్పటి ప్రభుత్వం హడావుడిగా వంతెనపై రాకపోకలను ప్రారంభించింది. అప్పటి నుంచి రోజుకు సగటున 20 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు కం రైలు బ్రిడ్జిపై భారీ వాహనాలను పూర్తిగా నిషేధించడంతో గామన్ వంతెనపై రాకపోకలు పెరిగాయి. ఈనెల 24న సాయంత్రం వంతెనపై 52వ స్తంభం వద్ద వైబ్రేషన్స్ అధికంగా రావడాన్ని గుర్తించిన సిబ్బంది వంతెనపై ఒకవైపు వాహన రాకపోకలను ముందస్తు జాగ్రత్త చర్యగా నిలుపుదల చేశారు. ఒకవైపు మాత్రమే వాహనాలను అనుమతించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వాహనాలు ఓవర్‌లోడ్ రాకపోకలు సాగించడంతో వంతెన జాయింట్లవద్ద యాక్షన్ బేరింగ్‌లు దెబ్బతినడంగాని, స్ప్రింగ్స్ కట్ అవ్వడంగాని జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు. మరోవైపు వంతెనకు అనుకుని గోదావరి నదిలో యంత్రాలతో డ్రెడ్జింగ్ చేపట్టి ఇసుక తవ్వకాలు చేపట్టడం ఓ కారణంగా భావిస్తున్నారు. ఏదైనా నిపుణుల బృందం వచ్చి పరిశీలించిన తరువాత గాని ఏ విషయాన్ని చెప్పలేమని అధికారులు చెబుతున్నారు. ఆర్‌డీసీ ఈఈ శ్రీకాంత్ మాట్లాడుతూ గామన్ వంతెనపై కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలో 52వ స్తంభం వద్ద అధికంగా వైబ్రేషన్స్ రావడంతో ముందస్తు జాగ్రత్త చర్యగా వంతెనపై ఒకవైపు రాకపోకలు నిలుపుదల చేశామన్నారు. బ్రిడ్జి స్ట్రక్చర్‌కు ఎటువంటి ప్రమాదం లేదని, భారీ వాహనాల రాకపోకలతో జాయింట్ల వద్ద యాక్షన్ బేరింగ్‌లు దెబ్బతిని ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. హైదరాబాద్ నుంచి నిపుణుల బృందం వస్తోందని, వంతెనను పరిశీలించి సమస్య ఉంటే మరమ్మతులు చేపట్టి వాహనరాకపోకలను అనుమతిస్తుందని చెప్పారు.


కుంగిన ప్రాంతం వద్ద దిగబడిపోయిన రోడ్డు


గామన్ వంతెనపై ఒకవైపు మాత్రమే రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

పిఠాపురం నుంచి
పవన్ ఎన్నికల శంఖారావం

- 30నుంచి ప్రచారం ప్రారంభం
- మూడు రోజులు ఇక్కడే
- ఉగాది వేడుకల్లో పాల్గొంటానని వెల్లడి



పిఠాపురం, మార్చి25: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తాను పోటీ చేస్తున్న కాకినాడజిల్లా పిఠాపురం నియోజకవర్గం నుంచే ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఈనెల 30వ తేదీ నుంచి ప్రచారం ప్రారంభించనున్నారు. మూడు రోజులపాటు ఇక్కడే ఉండి పలు సమావేశాల్లో పాల్గొంటారు. ఉగాది వేడుకలను ఇక్కడే జరుపుకుంటారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్‌కల్యాణ్ సోమవారం పార్టీ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 30వ తేదీన ఎన్నికల శంఖారావాన్ని పూరించేందుకు సిద్ధమయ్యారు. పిఠాపురం కేంద్రంగానే రాష్ట్రవ్యాప్త ప్రచారానికి వెళ్లతానని, అందుకు అనుగుణంగా ప్రచారం షెడ్యూల్స్ ఉండాలని సూచించారు. మూడు విడతలుగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. ప్రతి విడతలో జనసేన పోటీచేసే నియోజకవర్గాలకు వెళ్లేలా షెడ్యూల్స్ ఉండాలని తెలిపారు.

పిఠాపురంలో పర్యటన ఇలా

పిఠాపురం నియోజకవర్గానికి 30వ తేదీన చేరుకునే పవన్‌కల్యాణ్ అష్టాదశ శక్తి పీఠాల్లో దశమశక్తి పీఠం అధిష్ఠాన దేవతయిన పురుహూతికాఅమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడే వారాహి వాహనానికి పూజలు నిర్వహిస్తారు. అనంతరం దత్తపీఠాన్ని దర్శించుకుంటారు. అప్పటినుంచి మూడురోజులపాటు పిఠాపురం నియోజకవర్గంలోనే ఉండి పార్టీ నాయకులతో అంతర్గత సమావేశాలు జరుపుతారు. క్రియాశీలక కార్యకర్తలతో మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తారు. కూటమిలో భాగస్వాములైన తెలుగుదేశం, బీజేపీ నాయకులతో భేటీకి ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి సమావేశం ఉప్పాడలో జరుగుతుంది. నియోజకవర్గంలోని బంగారుపాప దర్గా సందర్శనతోపాటు క్రైస్తవ పెద్దలతో జరిగే సమావేశాల్లో పాల్గొంటారు. సర్వమత ప్రార్థనల్లో పాల్గొంటారు. ఉగాది వేడుకలను పిఠాపురం నియోజకవర్గంలోనే నిర్వహించుకోవాలని పవన్‌కల్యాణ్ నిర్ణయించుకున్నారు. పవన్ పర్యటన ఖరారు కావడంతో జనసేన నాయకులు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. మూడురోజుల పర్యటనలో ఒక బహిరంగ సభ నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి అధికారికంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

వెంకటేశ్వరుడి కల్యాణంలో అపశృతి

- యువకుడు బహిర్భూమికి వెళ్లే సమయంలో గొడవ
- కత్తులతో పొడిచి యువకుడి హత్య
- మరో ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలు
- భద్రాచలానికి చెందిన ఆరుగురు యువకుల దాడి
- పరారీలో నిందితులు


మృతి చెందిన సాయికుమార్

ఎటపాక, మార్చి 26 : అల్లూరి జిల్లా ఎటపాక మండలం వెంకటరెడ్డిపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణంలో అపశృతి చోటుచేసుకుంది. బహిర్భూమికి వెళ్లే సమయంలో గొడవజరిగి అది పెద్దదిగా మారి యువకుని హత్యకు దారి తీసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎటపాక మండలం వెంకటరెడ్డిపేటకు చెందిన స్థానిక యువకుడైన కొరిమి సాయి మధ్యాహ్నం సమయంలో వెంకటేశ్వరుడి ఆలయం సమీపంలోని జామాయిల్ తోటవైపు బహిర్భూమికి వెళ్లాడు. అదే జామాయిల్ తోటలో భద్రాచలం పట్టణానికి చెందిన ఆరుగురు యువకులు ఆహార పదార్థాలను తింటున్నారు. ఆవైపు బహిర్భూమికి వెళ్లేసాయిని చూసి భద్రాచలంనకు చెందిన ఆరుగురు యువకులు ఇటువైపు ఎందుకు వచ్చావు రా.. అంటూ స్థానికుడైన సాయివద్ద నుంచి వాటర్‌బాటిల్ లాక్కుని, ఇష్టానుసారం దుర్భాషలాడుతూ గొడవపడి తిట్టి పంపారు దాంతో సాయి తన స్నేహితులైన అజ్మీర సాయికుమార్, నక్కిన పోయిన శ్రీనును వెంట తీసుకుని వారి వద్దకు వెళ్లాడు. ఈనేపథ్యంలో రెండు గ్రూపుల యువకులు ఘర్షణ పడ్డారు. అనంతరం బాహాబాహికి దిగారు. ఈ నేపథ్యంలో భద్రాచలం పట్టణానికి చెందిన ఓ యువకుడి వద్ద బటన్ కత్తి ఉండడంతో అజ్మీర సాయికుమార్‌పై కత్తి పోట్లు పొడిచాడు. తీవ్రంగా గాయపడ్డ సాయిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.సాయికుమార్ స్నేహితులైనసాయి, నక్కినపోయిన శ్రీనులపై ఆరుగురు యువకులు కత్తులతో దాడి చేసే ప్రయత్నం చేశారు. అయితే వారు తప్పించుకోవడంతో చేతులపై తీవ్ర గాయా లయ్యాయి. గాయపడ్డ యువకులను ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన సాయికుమార్‌ది రాంగోపాలపురం తండా, పదో తరగతి చదువుతున్నాడు. ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు హత్యపై దర్యాప్తు చేస్తున్నారు. ఎన్నికల వేళ, అందులోను ఆధ్యాత్మిక ప్రదేశం చోట హత్య జరగడంపై వెంకటేశ్వరుడి కల్యాణానికి విచ్చేసిన భక్తులు భయందోళనకు గురయ్యారు. మద్యంమత్తులో దాడి చేసినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇటీవల భద్రాచలం పట్టణానికి చెందిన కొందరు పొరుగున ఉన్న ఎటపాకను అడ్డాగా మార్చుకు ంటూ గంజాయి సేవిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే ఎటపాకను అన్నీ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. ఇదే నేపథ్యంలో గంజాయి మత్తులోనే యువకులు దాడులకు తెగబడుతున్నట్లు విమర్శలు లేకపోలేదు. పోలీసులు, నిఘా వ్యవస్థలు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఫెన్సింగ్‌లో నైపుణ్యాలు సాధించాలి

- జీఎస్ఎల్‌లో జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్ పోటీలు
- 29 రాష్ట్రాల నుంచి పోటీలకు వచ్చిన క్రీడాకారులు


కత్తి యుద్ధం పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

రాజానగరం, మార్చి 25: కత్తి యుద్ధం ఏషియన్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన యోధురాలు(ఫెన్సర్)మొదటి భారతీయ వనిత సీఏ భవానీదేవిని స్ఫూర్తిగా ఫెన్సింగ్ (కత్తియుద్ధం)క్రీడలో నైపుణ్యాలు సాధించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.పద్మరాజు సబ్‌జూనియర్ ఫెన్సర్లకు పిలుపునిచ్చారు. యువజన, సాంస్కృతికశాఖ ఎఫ్ఏఏపీ(ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో 25వ జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు జీఎస్ఎల్ ప్రాంగణంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నన్నయ వీసీ పద్మరాజు, జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరావు ముఖ్యఅతిథులుగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ ప్రత్యర్థిపై దాడిచేయడం, కాపాడుకోవడంలో శారీరక చురుకుతనంతో పాటు, బుద్ధి కుశలత ఎంతో ముఖ్యమని, ఈ రెండింటినీ సమన్వయం చేసుకున్న వారు ఫెన్సింగ్‌లో ఉత్తమ ప్రమాణాలు సాధించగలరని చెప్పారు. సీనియర్ నేషనల్ ఫెన్సర్, ఎఫ్ఏఏపీ రాష్ట్ర కార్యదర్శి జీఎస్వీ కృష్ణభగవాన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి 10నుంచి 14 ఏళ్ల వయసున్న 250 మంది బాలికలు, 271 మంది బాలురు, 160 మంది కోచ్‌లు, మేనేజర్లు, టెక్నీషియన్లు ఫెన్సర్ల తల్లిదండ్రులు ఈ పోటీలకు హాజరైనట్లు చెప్పారు. మాజీ సెక్రటరీ, అసోసియేషన్ మెంటార్ ఎస్.సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఇద్దరి మధ్య 3 నిమిషాలు వంతున నిమిషం వ్యవధితో వెంట వెంటనే మూడుసార్లు పోటీ ఉంటుందన్నారు. 15 పాయింట్లు సాధించిన వారు విజేతలని, పోటీల్లో నైపుణ్యాలను కచ్చితంగా గుర్తించడానికి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగిస్తున్నామని, ఈ చాంపియన్‌షిప్‌లో విజేతలకు బంగారు, వెండి, కాంస్య పతకాలు బహుమతులుగా అందజేయనున్నట్లు చెప్పారు.

సత్యదేవుడిని దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



అన్నవరం, మార్చి 25: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కామేశ్వరరావు కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కంచి మూర్తి, ఏపీఆర్వో గణపతిరావు తదితరులున్నారు.

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించనున్నారు. ప్రత్యేక విధులు కేటాయించిన సిబ్బంది అంతా హుండీల లెక్కింపునకు హాజరుకావాలని ఈవో రామచంద్ర మోహన్ సర్క్యులర్ జారీ చేశారు.

28నుంచి ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలు

- కిర్లంపూడిలో ముగిసిన శిక్షణ
- ఆంధ్రప్రదేశ్ జట్టు ఎంపిక

కిర్లంపూడి, మార్చి 25: ఈనెల 28 నుంచి ఏప్రిల్ 1వరకు ఢిల్లీలో 56వ అఖిలభారత జాతీయ సీనియర్స్ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈనెల 14 నుంచి కాకినాడజిల్లా కిర్లంపూడి హైస్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టుకు ఇస్తున్న శిక్షణ సోమవారంతో ముగిసింది. కిర్లంపూడిలో జరిగిన శిక్షణ శిబిరానికి విజయనగరం, వైజాగ్, తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, కర్నూల్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. వారికి పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చిన అనంతరం తుది జట్టును ఎంపిక చేశారు. ఈసందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపీ ఖోఖో అసోసియేషన్ చీఫ్ పాటర్నర్ పెంటకోట నాగబాబు, జిల్లా ఖోఖో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చదలవాడ బాబి, జాన్ మోజేష్, దాడి గోవింద్ హాజరయ్యారు. జట్టు కోచ్‌గా అంతర్జాతీయ రైల్వే క్రీడాకారుడు కర్రి శ్రీనివాసరావు, అసిస్టెంట్ కోచ్‌గా కెవెల్ పాపారావు వ్యవహరించనున్నారు. ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టుకు పి.చక్రఅనూష, ఈ.హేమావతి, కె.కుమారి, ఎస్.అనురాధ, డి.శివనాగలక్ష్మి, డి.లఖిల, పి.రేవతి, కె.రమ్య, బి.శిరీష, వి.మోహనసత్యసింధు, పి.హేమ, వి.ప్రీతిరోజ్, ఎం.దివ్యశ్రీ, ఎం.అక్షయ, కె.చైతన్య ఎంపికయ్యారు. కార్యక్రమంలో కె.పట్టాభిరామ్, ఎం.సీతారామిరెడ్డి, పూర్వ జాతీయ క్రీడాకారులు పాల్గొన్నారు.

అనపర్తిలో టీడీపీకి 22 మంది నాయకుల రాజీనామా

- అనపర్తి సీటు మారిస్తే సహాయ నిరాకరణకు సిద్ధమంటూ ప్రకటన


రాజీనామా లేఖలను చూపుతున్న అనపర్తి నియోజకవర్గ టీడీపీ నాయకులు

అనపర్తి, మార్చి 25: తూర్పుగోదావరి జిల్లా అనపర్తి అసెంబ్లీ సీటును పొత్తుల్లో భాగంగా బీజేపీకి కేటాయిస్తున్నారంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో అనపర్తిలో టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. అధిష్ఠానం స్పష్టమైన ప్రకటన చేయాలని అనపర్తి సీటు టీడీపీ నాయకుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డిదేనని అధిష్ఠానం ప్రకటన చేయాలంటూ ఆదివారం పార్టీ నాయకులు డిమాండ్ చేసినప్పటికీ అధిష్ఠానం నుంచొ స్పష్టత రాకపోవడంతో సోమవారం అనపర్తి నియోజకవర్గం లోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులతోపాటు జిల్లా, రాష్ట్ర కమిటీల్లో పొందిన పదవులకు సుమారు 22మంది రాజీ నామాలు చేశారు. రాజీనామా లేఖలను రాజమహేంద్రవ రంలోని టీడీపీ జోన్-2 కార్యాలయంలో కోఆర్డినేటర్ సుజయ్‌కృష్ణ రంగారావుకు అందజేశారు. అనపర్తి టికెట్ ముందుగా ప్రకటించిన విధంగా టీడీపీకే ఇవ్వాలని అలాకాకుండా మా ర్చుచేస్తే వచ్చే ఎన్నికలలో నియోజకవర్గంలో పార్టీ నాయకులు శ్రేణులు సహాయనిరాకరణ చేపడతామనివారు పేర్కొన్నారు.

ఏలేరు కాలువలో పడి వృద్ధుడి మృతి

పెద్దాపురం, మార్చి 25: ఏలేరు కాలువలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన కాకినాడజిల్లా పెద్దాపురం మండల పరిధిలోని చద లాడ గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాడాల సూర్యనారాయ ణ (70) గత రెండు రోజులుగా కనిపించడంలేదు. బంధువులు ఇంటికి వెళ్లాడేమో అని కుటుంబ సభ్యులు అనుకున్నారు. బంధువుల ఇంటికి వెళ్లలేదని కుటుంబ సభ్యులు నిర్ధారించుకుని అతని కోసం గాలించడం మొదలుపెట్టారు. సోమవారం ఉదయం ఏలేరు కాలువలో ఒక మృత దేహం తేలుతూ స్థానికులకు కనిపించడంతో పోలీసులకు గ్రామస్థులు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకుతీసి అది సూర్యనారాయణదిగా గుర్తించారు. మృతుడికి కుమారుడు, కోడలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ సురేష్ కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రజలు సుఖశాంతులతో ఉండాలి'

దేవరపల్లి, మార్చి 25: ప్రపంచంలోని ప్రజలు సుఖశాంతులతో ఉండా లని, మరియమ్మతల్లి దీవెనలు అన్ని వర్గాల ప్రజలకు కలుగుతాయని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. మండలంలోని గౌరీపట్నంలో నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్మలగిరి విచ్చేసిన జయరావుకు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, ఫాదర్లు స్వాగతం పలికారు. ఆయన నిర్మలగిరి మందిరం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తుల నుంచి దివ్యబలిపూజలు ఆశీర్వచనాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుణ్యక్షేత్రానికి కులమతాలకు అతీతంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మేరీమాతను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకోవడం ఆనందకరమన్నారు. పుణ్యక్షేత్రానికి వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. కార్యక్రమంలో ఫాదర్లు అరోణు, మోజేష్, బాలరాజు, ఇమ్మానియేలు, ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా
నరసింహుడి శ్రీ పుష్పయాగం


శ్రీ లక్ష్మీనరసింహస్వామికి శ్రీ పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

కోరుకొండ, మార్చి 25: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు(5 రోజులు) ముగిసిన తర్వాత ఆరోరోజు సోమవారంరాత్రి స్వామివారికి పర్యాంగ సయనోత్సవం(శ్రీ పుష్పయాగం) కన్నుల పండువగా జరిగింది. ఆలయ అనువంశక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు, పెద్దింటి, పెదపాటి, పెరవళి, అనువంశక అర్చకస్వాములు శ్రీ పుష్పయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేక పల్లకీలో ఆశీనులను చేసి ఆలయం చుట్టూ ద్వాదశ ప్రదక్షిణలు చేయించారు. ఈ సందర్భంలో స్వామికి 11 రకాల పండ్లు, పుష్పాలతో నివేదన చేశారు. అనంతరం 12 రకాల ఆహార పదార్థాలతో 12 నివేదనలు సమర్పించారు. కార్యక్రమంలో కోరుకొండ పరిసర ప్రాంతాల భక్తులు, ధర్మకర్తలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అరకు పార్లమెంటు పరిధిలో
సామాజిక పోరు

- ఒకే సామాజిక వర్గం నుంచి కొత్తపల్లి గీత, చెట్టి తనూజ

రంపచోడవరం, మార్చి 25: అరకు పార్లమెంటు నియోజవర్గంలో ప్రధాన పార్టీల మధ్య పోరు ఒకే సామాజికవర్గం మధ్య పోరుగా మా రింది. ఇక్కడ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థిగా కొత్తపల్లి గీత, వైసీపీ నుంచి చెట్టి తనూజారాణి తలపడుతున్నారు. వీరు ఇరువురూ కూడా వాల్మీకి సామాజికవర్గం కావడంతో పోరు రసవత్తరంగా మారనున్నది. ఈ పార్లమెంటు నియోజకవర్గంలో రంపచోడవరం, అరకు, పాడేరు సెగ్మెంట్లలో మాత్రమే అధిక సంఖ్యలో వాల్మీకి సామాజికవర్గం ఉంది. తక్కిన నాలుగు సెగ్మెంట్లలో ఈ సామాజికవర్గం సంఖ్య అతి తక్కువగానే ఉంది. ఒకే సామాజికవర్గానికి చెందిన ఇద్దరు పోటీ పడితే వారి విజయాన్ని నిర్దేశించేది మాత్రం ఇతర సామాజిక రాజకీయ అంశాలే! కాగా ఈ ఇరువురి మధ్య పోరును ఏఏ అంశాలు నిర్దేశిస్తాయన్నది చర్చినీయాంశంగా మారింది. గతంలో వైసీపీ నుంచి ఎంపీగా నిలిచి నియోజకవర్గంలో పరిచయాలు ఉండటం, బీజేపీలో చేరి పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉనికి చాటుకుంటున్న కొత్తపల్లి గీత విజయావకాశాలపై ధీమాగా ఉన్నారు. ఇక వైసీపీ అభ్యర్థి విషయంలో స్థానికతతో పాటు ఇతర సామాజిక అంశాలు కూడా తమకు కలిసి వస్తాయన్న ధీమాతో ఉన్నారు. ఏదిఏమైనా అరకు పార్లమెంటులో ఒకే సామాజికవర్గ పోరు రసవత్తరంగా మారనుంది.

కాకినాడ సాగరతీరంలో
ఇండో-యూఎస్‌ఏ నావికాదళ విన్యాసాలు

- నేటి నుంచి 31 వరకు టైగర్ ట్రంప్
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్


సూర్యారావుపేట బీచ్‌లో ఇండో-యూఎస్ఏ విన్యాసాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

సర్పవరం జంక్షన్, మార్చి 25: కాకినాడ సాగరతీరంలో ఈనెల 26 నుంచి 31 వరకు భారత్- అమెరికా దేశాల సంయుక్త నావికా దళ విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఇండియా-యూఎస్ఏ ఆధ్వర్యంలో సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్ ప్రాంతంలో నిర్వహించనున్న టైగర్ ట్రంప్ విన్యాసాల ఏర్పాట్లను నావికా దళాల అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేవెల్ ఎన్‌క్లేవ్ పరిధిలో ఆరు రోజుల పాటు జరిగే టైగర్ ట్రంప్ విన్యాసాల్లో నేవీ, ఆర్మీలు సంయుక్తంగా విన్యాసాలు నిర్వహిస్తాయన్నారు. సంయుక్త విన్యాసాల్లో భారతదేశ రక్షణ దళాలు, యూఎస్ రక్షణ బలగాలకు చెందిన అధికారులు, సిబ్బంది సుమారు 800 మంది వరకు పాల్గొంటారన్నారు. అలాగే యుద్ధనౌకలు, యుద్ధట్యాంకర్లతో, వైమానిక దళాలతో విన్యాసాలు జరుగుతాయన్నారు. దేశ రక్షణ, భారత భూభాగంలో టెర్రరిస్టులు, శత్రువులు సముద్రమార్గాన వచ్చి దాడి చేసినప్పుడు వారిని ఏవిధంగా ఎదుర్కోవాలి, ఉగ్రవాద నిర్మూలన, శత్రుదేశాలతో యుద్ధ సమయంలో చేసే విన్యాసాలు ఇక్కడ నిర్వహిస్తారన్నారు. ప్రతిష్ఠాత్మక విన్యాసాలు జరిగే సమయంలో మంగళవారం నుంచి ఈనెల 29 వరకు బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. ఉప్పాడ సెంటర్ నుంచి లైట్‌హౌస్ వరకు వాహనాలకు అనుమతి లేదన్నారు. అచ్చంపేట జంక్షన్‌మీదుగా పిఠాపురం వైపు వెళ్లేలాచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌డీపీవో హనుమంతరావు, కాకినాడరూరల్ సర్కిల్ సీఐ కె.శ్రీనివాస్, తిమ్మాపురం ఎస్ఐ రవీంద్రబాబు, నేవీ అధికారులు పాల్గొన్నారు.

రంప అటవీ డివిజన్లో
ఇంటి దొంగలు

- 400కు పైగా టేకు చెట్లు నరికేసి 300కి పైగా తరలించేసిన వైనం
- ఇద్దరు తాగుబోతు దొంగల వాగ్వాదంతో భాగోతం బట్టబయలు
- రంగంలోకి దిగి నిగ్గుతేల్చిన అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్
- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు, ఇతర టెక్నాలజీతో బాధ్యులను గుర్తించే చర్యలు



మిగిలిపోయిన కలపను కొలవడానికి వచ్చిన అటవీశాఖ అధికారులు , మిగిలిపోయిన టేకు కలప దిమ్మలు

రంపచోడవరం, మార్చి 25: అల్లూరి జిల్లా రంపచోడవరం అటవీశాఖ డివిజన్లో సుమారు 400కు పైగా టేకు చెట్లు అక్రమ నరికివేతకు గురికాగా వాటిలో సుమారు 300కు పైగా చెట్లు గల్లంతయ్యాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం తరలిపోయిన చెట్ల విలువ సుమారు రూ.40 లక్షలు కాగా, సుమారు రూ.12 లక్షల విలువైన టేకు దిమ్మలను తరలింపు కోసం సిద్ధం చేసుకోగా ఇందులో భాగస్వాములైన ఇద్దరు తప్పతాగి తెచ్చుకున్న వాగ్వివాదం ఈ మొత్తం భాగోతాన్ని బట్టబయలు చేసింది. దీనిపై లోతుగా గమనిస్తే ఇదంతా అటవీశాఖలోని ఇంటి దొంగలందరూ తలాపాపం తిలా పిడికెడు అన్నచందంగా తేలింది. రాజమహేంద్రవరంలోని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ వై.శ్రీనివాసరెడ్డి నేరుగా రంగంలోకి దిగి జరిగిన అటవీ వినాశనంతోపాటు ఎంత విలువైన చెట్లు దొంగిలించబడ్డాయో నిగ్గుతేల్చారు. ఎవరిపాత్ర ఎంత ఉందో, ఇందుకు గల కారణాల నిగ్గు తేల్చేందుకు ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఆరుగురు డి.ఎఫ్.ఓ.లతో ఆరు కమిటీలను నియమించారు. రంపచోడవరం, మారేడుమిల్లి అటవీశాఖ రేంజ్ పరిధిలోని వెలుగుచూసిన ఈ భాగోతం పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. రంపచోడవరం రేంజ్ మారేడుమిల్లి రేంజ్ పరిధిలో అటవీశాఖకు చెందిన టేకు ప్లాంటేషన్లు విస్తృతంగా ఉన్నాయి. వాస్తవానికి నిర్దేశిత కాలం అనంతరం ఆయా ప్లాంటేషన్లలో టేకు చెట్లను అటవీశాఖే నరికించి అనంతరం కొత్త ప్లాంటేషన్లను వేయిస్తోంది. రంపచోడవరం రేంజ్ పరిధిలోని దేవరపల్లి బీటు, మారేడుమిల్లి రేంజ్ పరిధిలోని మారేడుమిల్లి బీటులలో ఉన్న టేకు ప్లాంటేషన్లలో సుమారు 400కు పైగా టేకుచెట్లను అక్రమంగా నరికేసి, వాటిలో సుమారు రూ.40 లక్షలకు పైబడిన విలువ కలిగిన 300కు పైగా టేకు చెట్లను తరలించేశారు. ఎంతో పగడ్బందీగా చీపురు పుల్లను సైతం అడవి దాటకుండా కాపు కాసే అటవీ శాఖ ఠాణా(చెక్ పోస్టు)లను ఈ టేకు కలప దర్జాగా దాటిపోయింది. ఈ అటవీ సంరక్షణ కోసం ఏర్పాటుచేసిన బేస్ క్యాంపులలో తాత్కాలికంగా పనిచేస్తున్న వారే ఇందులో కీలకపాత్ర పోషించారని, వారిలో ఇద్దరు తప్పతాగి ఒకరిపై ఒకరు దొంగతనాలను ఆపాదించుకుంటూ వాగ్వాదానికి దిగడం ద్వారా వారు వెలగబెట్టిన భాగోతం మొత్తం బయటపడింది. ఇది తెలిసిన మరుక్షణం రాజమండ్రి ఫ్లయింగ్ స్క్వాడ్ డి.ఎఫ్.ఓ. ప్రాథమిక విచారణ జరిపి చీఫ్ కన్జర్వేటర్‌కు నివేదించారు. దీంతో చీఫ్ కన్జర్వేటర్ శ్రీనివాసరెడ్డి ఈనెల కొద్ది రోజుల క్రితం ఈ రెండు రేంజ్‌ల పరిధిలో పర్యటించారు. మొత్తంగా సుమారు రూ.50లక్షలకు పైగా అటవీ వినాశనం జరిగి, అటవీ సంపద దొంగతనానికి గురైందని గుర్తించారు.

నిగ్గుతేల్చడానికి ఆరు బృందాలు నియామకం

ఇక్కడ నరికివేయబడిన టేకు చెట్లు ఏఏ ఠాణాల మీదుగా ఎక్కడకు వెళ్లిపోయాయో, ఎవరెవరు ఇందులో భాగస్వాములుగా ఉన్నారో, క్షేత్రస్థాయి నుంచి డివిజన్‌స్థాయి వరకూ అధికారులు, సిబ్బంది పోషించిన పాత్రలను నిగ్గుతేల్చాలని రాజమహేంద్రవరం ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో, కాకినాడ డీఎఫ్‌వో, భీమవరం డీఎఫ్‌వో, అమలాపురం డీఎఫ్‌వో, రాజమహేంద్రవరం డీఎఫ్‌వో, జంగారెడ్డిగూడెం సబ్‌డీఎఫ్‌ల ఆధ్వర్యంలో ఆరు బృందాలను నియమించారు. ఈ బృందాలు గత ఏడాది కాలంగా రంపచోడవరం డివిజన్‌పరిధిలో నమోదైన అన్నిరకాల కేసులను, ఆయా ప్లాంటేషన్లపై సాగిన అధికారుల పరిశీలనా నివేదికలను, ఆయా అధికారుల టూరు డైరీలను కూడా పరిశీలించాలని సి.సి.ఎఫ్ ఆదేశించారు. ఇంత పెద్దఎత్తున అటవీ వినాశనమే కాకుండా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సి ఆదాయానికి నష్టం వాటిల్లడానికి పై నుంచి కింద వరకూ నిర్లక్ష్యం వహించిన అందరిపైనా చర్యలకు చీఫ్ కన్జర్వేటర్ రంగం సిద్ధం చేస్తున్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

ఘనంగా కుమారస్వామి రథోత్సవం



శూలాలతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, మార్చి 25: చింతూరు మండలం వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలోసోమవారం కుమారస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహిం చారు. జలాశయాలవద్ద ఉన్న మారమ్మ ఆలయానికి ఆంధ్ర,ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణా, తమిళనాడు రాష్ట్రా లు ఉదయమే చేరు కుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు శూలాల వేషధారణలో సుబ్రహ్మణ్య నామస్మరణ చేస్తూ డొంకరాయి పురవీధుల్లో ఊరేగించారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పాల్గొన్న ఉత్తర పౌర్ణిమ మహోత్సవాలు ముగిశాయి. మాల ధరించిన స్వాములు వీపుపై గుచ్చి శూలాలతో రథాలను లాగుతూ రథోత్సవంలో పాల్గొన్నారు. హరోం హర వేల్వేల్ మురగ అంటూ ముందుకు సాగారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్, పోలీస్ సిబ్బంది, సీఆర్పీఎఫ్/42 బెటాలియన్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్.సుబ్రహ్మణ్యంశర్మ, కమిటీ సభ్యులు ఎం.రామకృష్ణ, ఎస్.దొర బాబు, కె. బాబ్జి తదితరులు కమిటీసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ



హోలీ ఆడుతున్న చిన్నారులు

మోతుగూడెం, మార్చి25: చింతూరు మండలం మోతుగూడెం మండలంలోని పలుచోట్ల సోమవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలు, పెద్దలు, మహిళలు రంగులు జల్లుకుని ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఉద్యోగస్తులు, గ్రామస్థులు జంగదాంబసెంటర్‌లో, 6డీ జెన్కో క్వార్టర్స్‌లో పిల్లలు ఉత్సాహం గా పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ



అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న దృశ్యం

చింతూరు, మార్చి 25: చింతూరులో సోమవారం అభయాంజనేయ ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. పురోహితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ విగ్రహ దాతలు ఓబుళ్ళనేని రామారావు చౌదరి కృష్ణవేణి దంపతులు అభయాంజ నేయ ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శబరి ఒడ్డు విఘ్నేశ్వరాలయం నుంచి పురోహితుల ఆధ్వర్యంలో ఊరేగింపుతో రామాలయం వద్దకు మేళతాళాలు జయజయ ధ్వానాలతో విగ్రహ దాతలతోపాటు భారీగా భక్తులు ఊరేగింపుగా విగ్రహ ప్రతిష్ఠ ప్రదేశానికి చేరుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులందరికీ దాతలు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం ఏర్పాటు చేశారు. పురోహితులు కెవిఎస్ఎస్ వరప్రసాద్, కోట చౌతన్య రామాలయ పురోహితులు రవి, ఆకోజు రాకేష్‌లు ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విగ్రహదాత కుటుంబ సభ్యులు నర్సింహరావు, పుణ్యేశ్వరరావు, గంగాభవాని దంపతులు పాల్గొన్నారు.

మెగా క్రికెట్‌టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న రైతు యాలం రామకృష్ణ

కూనవరం, మార్చి 25: మండలంలోని స్థానిక పోలీస్‌గ్రౌండ్‌లో మెగా క్రికెట్ టోర్నీ సోమవారం ప్రారంభమైంది. ఈమెగా క్రికెట్‌టోర్నీ ప్రముఖరైతు టోర్నమెంట్ దాత యాలం రామకృష్ణ ప్రారంభించారు. టోర్నమెంట్‌లో కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక, చింతూరు, వెలేరుపాడు మండలాలకు చెందిన 55జట్లు పాల్గొననున్నాయి. ఈకార్యక్రమంలో ఆర్గనైజర్స్ సోడే మహేంద్ర, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ పూనెం కిరణ్, నల్లంపల్లి సాయి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన జై భీమ్ పార్టీ గణేష్‌స్వామి

రంపచోడవరం, మార్చి 25: జై భీమ్ పార్టీకి చెందిన జె.గణేష్ స్వామి సోమవారం అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత సమక్షంలో బీజేపీలో చేరారు. గణేష్ స్వామికి పార్టీ కండువా కప్పిన గీత నియోజకవర్గంలో కూటమి విజయం కోసం కృషి చేయాలని సూచించారు.

పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రాజవొమ్మంగి, మార్చి 25: అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని మారేడుబాకకు చెందిన చిట్టోజి లోవరాజు అనే వ్యక్తి 2018 ఆగస్టు 3వ తేదీన ఓ మైనర్ బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అత్యాచారయత్నానికి ప్రయత్నించి ఆమె ప్రతిఘటించడంతో కత్తితో ఆమెపై దాడిచేసి పరారయ్యాడు. ఘటనపై బాలిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ గోపి నరేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. తరువాత లోవరాజు బెయిల్‌పై బయటకు రాగా సోమవారం పోక్సో స్పెషల్ కోర్టులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జీ తీర్పునిచ్చారు.

చివటంలో కామ దహనం

ఉండ్రాజవరం, మార్చి 25: మండలంలోని చివటం గ్రామంలో ఆదివారం రాత్రి కామ దహనం(కలప చెక్క వస్తువులు) కార్యక్రమం నిర్వహించారు. పూర్వం వేసవి కాలంలో గ్రామంలో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతుండేవి. వీటిని అరికట్టేందుకు అగ్ని దేవునికి మొ క్కుబడిగా తమకు అక్కరకు రాని కలప, చెక్క వస్తువులు మంటలో వేసి దహనం చేయడంతో అగ్నిప్రమాదాలు ఆగిపోయాయని, అప్పటి నుంచి ఏటా హోళీ పౌర్ణమి రోజున ఈ కామదహనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్థానికులు చెప్పారు. గ్రామ ప్రధాన కూడలిలో రావిచెట్టు కొమ్మను పాతిపెట్టి కొమ్మ చుట్టు ఊరేగింపు జరిపి చెక్క వస్తువులు వేసి దహనం చేశారు. కార్యక్రమాన్ని గ్రామస్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాల వారు తిలకించారు.

28న కొవ్వూరులో దివ్యాంగుల సదరం శిబిరం

కొవ్వూరు, మార్చి 25: కొవ్వూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 28న దివ్యాంగుల వైకల్య నిర్ధారణ పరీక్షా శిబిరం ఏర్పాటు చేసినట్టు సమగ్రశిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఈ శిబిరంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఉపకరణాలు అందజేస్తారన్నారు. శిబిరానికి హాజరైన దివ్యాంగ పిల్లలకు ఉచిత భోజనం, రవాణా చార్జీలు అందిస్తారన్నారు. కొవ్వూరు, నల్లజర్ల, గోపాలపురం, తాళ్లపూడి, దేవరపల్లి మండలాల దివ్యాంగుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దుర్మార్గ పాలనను అంతమొందించాలి

» రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల
» వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే పవన్ పోరాటం
» టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గేష్
» కడియంలో టీడీపీ-జనసేన ఆత్మీయ సమావేశం



కడియంలో ఐక్యత అభివాదం చేస్తున్న దుర్గేష్, గోరంట్ల

కడియం, మార్చి 25: రాష్ట్రంలో దుర్మార్గపు వైసీపీ పాలనను అంతమొందించడానికి సమష్టిగా ముందుకెళదామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కడియంలోని జీఎస్ఆర్ కన్వెన్షన్‌లో సోమవారం జరిగిన జనసేన-టీడీపీ ఆత్మీయ సమావేశానికి గోరంట్లతోపాటు టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి కందుల లక్ష్మీదుర్గేష్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. రెండు చోట్లా తమ విజయం తథ్యమని వారిద్దరూ అన్నారు. ఈ సందర్భంగా తొలుత దుర్గేష్ రూరల్ జనసైనికులతో మాట్లాడారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ తన వెంట ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మంచి పాలన అందాలని, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావాలని, దుర్మార్గపు పాలన అంతమొందించడానికి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశ్యంతో ఈ కూటమిలో కీలకంగా వ్యవహరిస్తూ తనను నిడదవోలు పంపారన్నారు. పొత్తు ధర్మంలో భాగంగా ఇక్కడ ఉమ్మడి అభ్యర్థి గోరంట్లను అఖండ మెజారిటీతో గెలిపించాలనిజనసైనికులకు దుర్గేష్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ దుర్గేష్ మంచి రాజకీయ విలువలున్న నాయకుడన్నారు. అక్కడ దుర్గేష్, ఇక్కడ తాను అత్యధిక మెజారిటీతో గెలుపొంది శాసనసభలో అడుగు పెడతామన్నారు. టీడీపీ హయాంలో నర్సరీ రైతుల శ్రేయస్సుకు కృషి చేశామన్నారు. అన్ని వర్గాలు ఐకమత్యంతో మెలిగి కూటమి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కడియం, రూరల్ మండలాల జనసేన, టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరిస్థితులు సర్దుకున్నాక కలుద్దామనుకున్న: గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్ నుంచి నిడదవోలు వెళ్ళిన దుర్గేష్‌కు అక్కడ పరిస్థితులు సర్దుకున్న తరువాతే జనసైనికులను కలుద్దామని ఉద్దేశ్యంతో ఇప్పటి వరకు తాను వేచి ఉన్నానని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. దుర్గేష్ వచ్చి సమావేశం నిర్వహించిన తరువాత జనసైనికులను కలుస్తామని చెప్పడం జరిగిందని, అందుకే జాప్యం జరిగిందన్నారు. తన వద్ద గ్రూపులు, వర్గాలు ఉండవని, అందర్ని కలుపుకొని వెళ్ళడమే తన లక్ష్యం అన్నారు. కాపుల కోసం ఏమీ చేయని కాపు ఉద్యమ నాయకుడు ప్రభుత్వానికి కొమ్ము కాస్తున్నారన్నారు. రానున్న కాలంలో పవన్‌కళ్యాణ్‌కు ఎంతో భవిష్యత్తు ఉందన్నారు. సొంత నాయకులే తరిమేసిన నాయకుడు రాజమహేంద్రవరం రూరల్‌లో పోటీకి వచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి, దేశంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలి

» ఇప్పటి వరకు 265 మందిపై బైండోవర్ కేసులు
» కోరుకొండ నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీనివాసరావు



కోరుకొండ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కోరుకొండ, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ విడుదల చేసిన నియమావళిని అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు కచ్చితంగా పాటించాలని నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. కోరుకొండ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 265 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.1లక్ష పూచీ కత్తుపై తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. నియోజకవర్గ సరిహద్దు ప్రాంతాలైన గోకవరం, రాజానగరం వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.12లక్షలు విలువైన 4వేల లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. 37వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. 477 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని బెల్ట్‌షాపులపై కేసులు నమోదు చేశామన్నారు. కోరుకొండ నార్త్‌జోన్ పరిధిలో 109 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 14మందిని అరెస్ట్ చేశామన్నారు. ఐదు కేసులు నమోదు చేశామన్నారు. ప్రతి ప్రాంతంలో ఉన్నతాధికారుల సారథ్యంలో ప్రత్యేక పోలీస్ దళాలు, స్పెషల్ స్క్వాడ్‌లు, మఫ్టీ పోలీసులతో నిఘా పెట్టామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనే అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలన్నారు. ఓటర్లు ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో కోరుకొండ సీఐ అడపా నాగమురళీ, రాజానగరం సీఐ పి.కాశీ విశ్వనాథం, ఎస్.ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

భరత్‌ను 2019లోనే ప్రజలు తిరస్కరించారు

» టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్



భవిష్యత్తుకు గ్యారెంటీలో అవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతున్న వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25: రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ప్రజలు 2019 ఎన్నికల్లోనే భరత్ రామ్‌కు 28వేల ఓట్ల మైనస్ ఇచ్చి తిరస్కరించారని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం 21, 32 డివిజన్లలో ఆయన పర్యటించారు. ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే కొన్ని గంటల ముందు హడావిడిగా అనేక పనులకు ఎంపీ భరత్‌రామ్ శంకుస్థాపనలు ఎందుకు చేశారో ఆలోచించాలన్నారు. తన స్వార్థం కోసం వలంటీర్లను వినియోగించుకున్న భరత్‌రామ్ వారి ఉపాధికి గండికొట్టారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, నిమ్మలపూడి గోవింద్, ద్వారా పార్వతిసుందరి, రఫిక్ రాజా, సప్పా వెంకట రమణ, తవ్వా రాజా, వెలమ దుర్గాప్రసాద్, కొమ్మ రమేష్ పాల్గొన్నారు.

25శాతం బ్రాండ్ అంబాసిడర్ భరత్‌రామ్

రాజమహేంద్రవరంలో 25 శాతం కమిషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపీ భరత్‌రామ్ నిలిచారని జనసేన జిల్లా కార్యదర్శి జామి సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిఠాపురం నుంచి పవన్‌కల్యాణ్ పోటీ చేస్తుంటే వైసీపీ నాయకుడు భయపడి ఆయన్ను ఓడించడానికి ఐదుగురిని దింపారని, సొంత సామాజిక వర్గానికే న్యాయం చేయలేని ముద్రగడ వల్ల ఏం కాదన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్ మాట్లాడుతూ నగరంలో చాలా పనులకు కేంద్రం నిధులు ఇచ్చిందన్నారు. రూ.348 కోట్లతో మధురపూడి విమానాశ్రయాన్ని అభివృద్ధి కేంద్రం చేస్తే దానిని భరత్‌రామ్ వైసీపీ ప్రభుత్వమే చేసిందంటూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. టీడీపీ నగర ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకీరామయ్య మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో టీడీపీని ఢీకొట్టడం వైసీపీ తరం కాదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకుడు తవ్వా రాజా, జనసేన నాయకుడు అల్లంకి నాగేశ్వరావు, బీజేపీ నాయకుడు బూరా రామచంద్రరావు, జీవీ రత్నారెడ్డి పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టియే లక్ష్యం

» జనసేన-టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల ప్రచారం



కోరుకొండ: కణుపూరులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బత్తుల వెంకటలక్ష్మి

కోరుకొండ/సీతానగరం, మార్చి 25: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన-టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణను అత్యధిక మెజారిటీతో గెలిపించడం కోసం మూడు పార్టీల నాయకులు త్రిశూల వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఈ మేరకు నియోజకవర్గం ఈశాన్య దిశలోని రాజవరం గ్రామం ఆత్మీయ సమావేశాలకు శ్రీకారం చుట్టారు. అదే విధంగా మూడు మండలాల్లో మూడు చోట్ల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా కోరుకొండమండలం సీతారాంపురం గ్రామం నుంచి బలరామకృష్ణ కుమార్తె వందనాంబిక ఇంటింటా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అలాగే ఆయన సతీమణి బత్తుల వెంకటలక్ష్మి సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో ప్రచారం చేపట్టారు.

కణుపూరులో జనం కోసం జనసేన.. జనం కోసం జనసేన మహాపాదయాత్రలో భాగంగా కణుపూరులో బలరామకృష్ణ జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి గాజుగ్లాసుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బత్తుల వెంకటలక్ష్మి, మూడు పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ విజయం కోసం బీజేపీ పూజలు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించాలని నరేంద్రమోదీ 3వ సారి ప్రధాని కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి రాజమహేంద్రవరం ఎంపీగా విజయం సాధించాలని కోరుతూ బీజేపీ నాయకులు కోరుకొండ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. కోరుకొండ నరసింహస్వామి, సాయిబాబా ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి, ఏపీఆర్ చౌదరి, అడబాల గణపతిరావు, పచ్చారి నరసింహమూర్తి, తగరంపూడి గణపతి, శ్రీదేవి పాల్గొన్నారు.

జ్యోతుల నెహ్రూను గెలిపించండి

గోకవరం, మార్చి 25: రాబోయే ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆయన కోడలు జ్యోతుల లక్ష్మీదేవి, మనవడు అనీష్ నెహ్రూ గోకవరంలో ఎన్ని కల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ముందుగా వారు వినాయక, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సెంటుమెం టుగా మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకులు బత్తుల సత్తిబాబు, లక్ష్మి దంపతుల ఇంటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. టీడీపీ మేనిఫెస్టో, నెహ్రూ మేనిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను వారికి అందజేశారు. అనంతరం మల్ల వరం చేరుకొని శివాలయంలో పూజల తదుపరి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. నియోజకవర్గంలో శాశ్వత అభివృద్ధి కావాలంటే నెహ్రూను గెలిపిం చుకోవాలని వివరించారు. మల్లవరంలో రూ.132 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన ఘనత నెహ్రూదేనన్నారు.

కూటమిని అధికారంలోకి తీసుకురండి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25: రాజమహేంద్రవరం ఎంపీగా ఎన్నికల బరిలోకి దిగుతున్న ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను గెలిపించడం ద్వారా కూటమిని అధికారంలోకి తీసుకురావాలని జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం 10వ డివిజన్‌లో ఆయనతోపాటు జనసేన జిల్లా నాయకుడు జామి సత్యనారాయణ, దాసరి గురునాథరావు, చొప్పెల వీరభద్రరావు, షేక్ ఖాన్, షేక్ బాషా, కప్పల ప్రకాష్, తేజోమూర్తుల నరసింహమూర్తి, మానే ఆదిబాబు, ఉమ్మడి భాగ్యలక్ష్మి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.



ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సాయిబాబా ఆలయంలో కుంభాభిషేక ఉత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 25: రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్ ప్రాంగణం వద్ద షిరిడీసాయి మందిరంలో వార్షిక కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా జరుగుతుతున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం సాయంకాలం దత్తపీఠ స్వర్ణ కంకణ సత్కార గ్రహీత తాతా సందీప్‌శర్మ భాగవతంపై ప్రవచనం చేశారు. శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మదన గోపాలస్వామి దీక్ష తీసుకొని నిత్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బీవీ రవికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీణా వాయిద్య కచేరి అలరించింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి శ్రీపుష్పయాగం

బిక్కవోలు, మార్చి 25: కొంకుదురులోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి శ్రీపుష్పయాగం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అర్చకులు అంగర శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పూలతో అలంకరించిన శ్రీపుష్ప యాగ పల్లకి అందర్నీ ఆకర్షించింది. భక్తులందరూ స్వీట్లు, పూలను స్వామి అమ్మవార్లకు కానుకలుగా సమర్పించారు.

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ఆవిష్కరణ



మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.పద్మశ్రీ ఆవిష్కరించారు. స్థానిక వై.జంక్షన్ ఆనం రోటరీ హాలులో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఏడు నియోజకవర్గాల నాయకులు అత్యవసర సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శులు ముళ్ళ మాధవ్, బోడా వెంకట్, బాలేపల్లి మురళీధర్, అధికార ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాసరావు, డాక్టర్ వడయార్, మార్టిన్ లూథర్, నలబాటి శ్యామ్, కిషోర్ కుమార్ జైన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలు అమలు కావాలంటే కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఐదు అద్భుతమైన పథకాలతో మేనిఫెస్టోను రూపకల్పన చేశారని, దానిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. సమావేశంలో రౌతు విజయలక్ష్మి, శారద, పార్వతి, వివిధ ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.

త్యాగరాజ సంగీతోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 25: శ్రీ త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత వార్షికోత్సవాలు ఏడో రోజు సోమవారం కొనసాగాయి. వేలూరి తులసి విశ్వనాథ్ (గాత్రం), చిరంజీవి వేలూరి నీరజ (గాత్ర సహకారం) పెరవలి నందకుమార్ (వయోలిన్), పెరవలి జయభాస్కర్ (మృదంగం), సరస్వతుల హనుమంతరావు (ఘటం) బృందం శ్రోతలకు వీనులవిందుగా ఆలపించారు. సంగీత ప్రియులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

శ్రీ చైతన్య మహాప్రభు ఆవిర్భావ మహోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి25: స్థానిక ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో శ్రీ చైతన్య మహాప్రభు ఆవిర్భావ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం నగర సంకీర్తన, భక్తి కంకణ వన మహరాజ్ ప్రవ చనం, పంచామృత ఫల పుష్పాలతో స్వామి వారికి మహాభిషేకం జరిగాయి. భోగి మంటలు వేశారు. 108 పిండి వంటలతో మహారాజ భోగం నిర్వహించారు. హారతి అనంతరం ఘనంగా హోలీ వేడుకలు జరిపారు. ఏర్పాట్లను శ్రీకృష్ణ చైతన్య మిషన్ డిప్యూటీ సెక్రటరీ అండ్ టెంపుల్ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాసు బ్రహ్మచారి పర్యవేక్షించారు.

జీడి గింజలకు మద్దతుధర ప్రకటించాలి

బీజేపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు అర్జున్

దివాన్‌చెరువు, మార్చి 25: ప్రభుత్వం జీడిమామిడి గింజలకు మద్దతు ధర ప్రకటించాలని బీజేపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు దొడ్డా అర్జున్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జీడి గింజలను ప్రభుత్వం కొనుగోలు చేయకపోగా కనీసం మద్దతు ధరనైనా ప్రకటించడం లేదన్నారు. కమీషనుదార్లే వీటిని కొనుగోలు చేస్తున్నారని, దీంతో సీజన్‌లో సరైన ధర పలకక రైతులు నష్టపోతున్నారని వాపోయారు. త్వరలో సీజను ప్రారంభం కానున్నందున 80కిలోల బస్తాకు కనీసం రూ.10 వేలైనా మద్దతు ధరగా నిర్ణయించాలని సూచించారు. అలాగే ఈ జీడిగింజలను రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు.

విద్యార్థినులు బలవర్ధక ఆహారం తీసుకోవాలి

బిక్కవోలు, మార్చి 25: ఆడపిల్లలందరూ జన్యు లోపాలను అధిగమించేందుకు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని మండల అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ టి.సుప్రియ సూచించారు. స్థానిక ప్రజ్ఞా జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో సోమవారం నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నారి శక్తి ఫిట్నెస్ రన్స్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆడపిల్లలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, ఫిట్‌గా వుండేందుకు తగిన వ్యాయామం చేయాలన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన పరుగు పందెంలో విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ యూత్ వలంటీర్ మణికంఠరెడ్డి, కరస్పాండెంట్ ఓదూరి శ్రీను, ప్రిన్సిపాల్స్ గోవిందరాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు లోకజ్ఞానం, సంస్కారం అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సురేష్

గోకవరం, మార్చి 25: ప్రతి విద్యార్థికి చదువుతోపాటు లోకజ్ఞానం, సంస్కారం అవసరమని గోకవరంలోని జ్ఞాన సరస్వతి విద్యా నికేతన్ చైర్మన్ కంచర్ల సూర్యప్రకాష్, ఫౌండర్, డైరెక్టర్ బొడ్డేటి సురేష్ అన్నారు. పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సులో సూర్యప్రకాష్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పలువురు తల్లిదండ్రులు తమ స్వీయ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా హోలీ వేడుకలు

కొవ్వూరు/ఉండ్రాజవరం, మార్చి 25: హోలీ పండుగను ఉండ్రాజవరం, కొవ్వూరులో పెద్దలు, చిన్నలు ఆనందోత్సాహాలతో వేడుకగా జరుపుకున్నారు. చిన్నారులు ఒకరికొకరు రంగులు పూసుకుంటు ఆనందంగా గడిపారు. వీధుల్లో చిన్నారుల రంగులు కలిపి బాటిళ్లతో చేసిన హడావుడి ఆకట్టుకున్నాయి.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	భీమా
సూర్యామినీ	బస్తర్, యోధ
సూర్యాప్యాలస్	కుంఫూ పాండా-4
స్వామి	వెయ్ దరువెయ్
శివజ్యోతి	హనుమాన్
అనుశ్రీ(సాయికృష్ణ)	ప్రేమలు
రాజా	రజాకార్
ఊర్వశి	రజాకార్
రంభ	తంత్ర
మేనక	లంబసింగి, షరతులు వర్తిస్తాయి
అప్సర	గామి
కుమారి	మాయ, ప్రేమలు
వీఎస్ మహాల్(నామవరం)	రజాకార్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	ప్రేమలు
వెంకటసూర్య(కడియం)	భీమా
సత్యగౌరి (అనపర్తి)	భీమా
సూర్యశ్రీ (అనపర్తి)	ఊరుపేరు భైరవకోన
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	ప్రేమలు
రామకృష్ణ(కోరుకొండ)	భీమా
గీతాసినిమాస్ (సీతానగరం)	భీమా
శ్రీనివాస (గోకవరం)	భీమా
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	ఊరుపేరు భైరవకోన
లలితామహాల్(రంపచోడవరం)	భీమా
నవయుగ(చింతూరు)	వెయ్ దరువెయ్

రంజాన్ వేళలు
ఇఫ్తార్(మంగళ) సా.6.24
సహరి(బుధ) ఉ.4.42

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	39.0	22.0

ఎలక్షన్ నిఘా



సీ-విజిల్ యాప్‌లో 182 ఫిర్యాదులు

పలుచోట్ల నగదు.. మద్యం స్వాధీనం

ఎన్‌కోర్ ద్వారా 115 దరఖాస్తులు..

61కి ఆమోదం.. 33 తిరస్కరణ

జిల్లా కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణ వ్యవస్థ అమలులో భాగంగా సీజర్ (స్వాధీనం), ఎన్‌కోర్ మేనేజ్మెంట్ (అనుమతులు), సీ విజిల్ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఇప్పటికే మంచి ఫలితాలు వస్తున్నాయని జిల్లా ఎన్నికల అధికారి డా. కె.మాధవీలత ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటికే సీ విజిల్ ద్వారా ఆదివారం అర్ధరాత్రి వరకూ 182 ఫిర్యాదులు అందాయని, సోమవారం రాజమహేంద్రవరం రూరల్‌లో 2, నిడదవోలు నుంచి ఒక ఫిర్యాదు వచ్చిందన్నారు. రూ.50 వేలు కంటే ఎక్కువ అనధికార నగదు తీసుకుని వెళ్లకూడదనే నిబంధనతో జిల్లాలో ఇప్పటి వరకూ నిర్వహించిన తనిఖీలలో నిడదవోలు నియోజకవర్గంలో ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.2 లక్షలు, రూ.లక్షా 14వేలు, రూ.6 లక్షల 30 వేలు మొత్తం రూ.9 లక్షల 44 వేలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆధారాలు చూపించడం వల్ల రూ.3 లక్షల 14 వేలు తిరిగి ఇచ్చినట్టు చెప్పారు. ఎక్సైజ్ పోలీసు శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని ఏడు చెక్‌పోస్టుల వద్ద జరిగిన తనిఖీలలో రూ.లక్షల విలువైన మద్యం దొరికిందన్నారు. జిల్లాలో 63 వివిధ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయన్నారు. ఎక్సైజ్, పోలీసు శాఖ నిర్వహించిన 65 దాడులలో రూ.9 లక్షల 14 వేల ఖరీదైన 3047 లీటర్ల మద్యం దొరికిందని, 72 మందిని అరెస్ట్ చేశామన్నారు. రూ.లక్షా 69వేల ఖరీదైన 33 వేల 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్టుచెప్పారు. అనధికార బెల్ట్ షాపులలో డ్యూటీ పెయిడ్ మద్యం అమ్ముతున్న 95 మందిపై కేసులు నమోదు చేసి, 2,27,183 విలువైన 672 లీటర్ల మద్యం సీజ్ చేసినట్టు చెప్పారు. గంజాయికి చెందిన మూడు దాడుల్లో 5 మందిని అరెస్ట్ చేసి, రూ.3,61,550 విలువైన సుమారు 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసు కున్నామన్నారు.

ఎన్‌కోర్ మేనేజ్‌మెంట్ విధానంలో

ఎన్‌కోర్ మేనేజ్‌మెంట్ విధానంలో సింగిల్ విండోలో సువిధ యాప్ ద్వారా వస్తున్న దరఖాస్తులను మార్గదర్శకాల మేరకే అనుమతులు ఇస్తున్నట్టు మాధవీలత తెలిపారు. సక్రమంగా లేని వాటిని తిరస్కరిస్తున్నామన్నారు. 48 గంటలలో అనుమతులు ఇస్తున్నట్టు చెప్పారు. రాజకీయ పార్టీలు అనుమతి కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో అవసరమైన ధ్రువ పత్రాలన్ని పొందుపరచాలని సూచించారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్‌కోర్ ద్వారా 115 అభ్యర్థనలు రాగా, 61కి అనుమతి ఇచ్చి, 33 తిరస్కరించామని, 7 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనపర్తిలో 11 దరఖాస్తుల్లో 10 ఆమోదం పొందగా, ఒకటి తిరస్కరించారు. రాజానగరంలో 37కి 22ని ఆమోదించి 14 తిరస్కరించారు. ఒకటి పెండింగ్‌లో ఉంది. రాజమండ్రి సిటీ నుంచి 30 దరఖాస్తులు రాగా, 7 ఆమోదం పొందగా 11 తిరస్కరించారు. ఆరు పరిశీలనలో ఉండగా, 6 పెండింగ్‌లో ఉన్నాయి. రాజమండ్రి రూరల్‌లో 4రాగా మూడు ఆమోదం పొందాయి. ఒకటి తిరస్కరించారు. కొవ్వూరులో 7 రాగా, 5కి ఆమోదం తెలిపి, 2 తిరస్కరించారు. నిడదవోలులో 17రాగా, 10కి ఆమోదం తెలిపి ఏడింటిని పరిశీలిస్తున్నారు. గోపాలపురంలో 9 రాగా 4 ఆమోదించారు. 4 తిరస్కరించారు. 1 పరిశీలనలో ఉన్నట్టు చెప్పారు. ప్రచారం కోసం గోడలమీద ఎటువంటి రాతలు రాయకూడదని, కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ మాధవీలత హెచ్చరించారు. ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యాల ప్రజా ప్రాతినిధ్య చట్టం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. ప్రచురణలకు సంబంధించి మూడు రోజులలో ఆర్వోలకు నివేదికలు పంపాలన్నారు.

డ్రెడ్జింగ్ ముప్పు



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరిలో ఇసుక అక్రమాలు, ఇసుక డ్రెడ్జింగ్ వల్ల గోదావరి వంతెనలకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. గామన్ బ్రిడ్జి కొంత కుంగడానికి బ్రిడ్జి సమీపంలో ఇసుక తవ్వకాలు చేయడం ఒక కారణమా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కూడా రోడ్ కమ్ రైలు బ్రిడ్జి, రైల్వే ఆర్చి వంతెన విషయంలో ఢిల్లీ నుంచి వచ్చిన నిపుణులు హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. వంతెనలకు దగ్గరలో ఇసుక తవ్వకాలు చేయడం వల్ల వంతెనకు ముప్పు వాటిల్లుతుందని కూడా గతంలో హెచ్చరించారు. అనేక జాగ్రత్తలు చెప్పారు. కానీ అధికారులు నిబంధనలను ఆచరణలో పెట్టడం లేదు. నిపుణులు హెచ్చరించినప్పటికీ గోదావరి బ్రిడ్జిల సమీపంలో తవ్వకాలు ఆగడం లేదు.





గోదారిలో యథేచ్ఛగా ఇసుక డ్రెడ్జింగ్

అనుమతులు మీరి లోతైన తవ్వకాలు

అన్ని కార్యకలాపాలు నిబంధనలకు విరుద్ధంగానే..

గోదావరి బ్రిడ్జిలకు పెనుముప్పు

నిపుణులు హెచ్చరించినా ఆగని తవ్వకాలు

గామన్ బ్రిడ్జి కుంగడం వెనుక ఇదే కారణమా?

కోడ్ అమల్లోకి వచ్చినా..

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా అధికారులు ఇంకా వైసీపీ సేవలోనే నిమగ్నమయ్యారు. వైసీపీ అధిష్ఠానానికి భయపడి కళ్ల ఎదుటే అక్రమాలు, దోపిడీ జరుగుతున్నా మౌనం వహిస్తున్నారు. ఇసుక అక్రమాలు ఆపడం కోసం ఫిబ్రవరి 17వ తేదీని జిల్లా కలెక్టర్ ఐదుగురు సభ్యులతో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ టాస్క్ ఫోర్స్ సభ్యులు ఏమయ్యారో, ఏమి చేస్తున్నారో కానీ, ఇసుక అక్రమాలను ఆపలేకపోతున్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో ఎస్ఈబీ, మైన్స్, ఇరిగేషన్, పోలీసు, రెవెన్యూ అధికారులతో ఈ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గోదావరిలో అక్రమంగా డ్రెడ్జింగ్ జరిగిపోతోంది. గాయత్రి, కాతేరు, కోటిలింగాల, కొవ్వూరు డివిజన్ పరిధిలోనూ అనధికారికంగా డ్రెడ్జింగ్‌తో రోజుకే వేలాది టన్నులు ఇసుక తవ్వేస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఇసుక తీసి, ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. భద్రతా చర్యలలో భాగంగా బ్యారేజీ, రోడ్ కమ్ రైలు బ్రిడ్జి, రైలు వంతెనలకు 500 మీటర్ల లోపు తవ్వకాలు నిషేధమని అధికారులు ప్రకటించారు. హద్దులు ఏర్పాటు చేసి బారికేడ్లు ఏర్పాటు చేస్తామన్నా ఎవరూ పట్టించుకోలేదు.

నిపుణులు హెచ్చరించినా..

రోడ్ కమ్ రైలు బ్రిడ్జి మీద నుంచి ఇప్పటికే భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీని లైఫ్ దాదాపు అయినట్టు అప్పట్లో ప్రకటించారు. కొంత మేర రిపేర్లు చేసి, రోడ్డు వేసి ఆర్టీసీ ఆర్డినరీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. రైల్వే నిపుణులు పరిశీలించి, బ్రిడ్జి పూర్తి రిపేర్లకు సిఫార్సు చేస్తారని కూడా అప్పట్లో ప్రకటించారు. అవేమీ అమలులోకి రాలేదు. ఎన్ని నిబంధనలు విధించినా తవ్వకాలు ఆగడం లేదు. అధికారులూ పట్టించుకోవడం లేదు. వాస్తవంగా గోదావరిలో నీటి నిల్వ పెంచడం కోసం డ్రెడ్జింగ్ చేస్తే బ్యారేజీకి మూడు కిలోమీటర్ల వరకూ ఎటువంటి తవ్వకాలు జరగకూడదు. అంతే కాక గోదావరి రోడ్డు కం రైలు బ్రిడ్జి, రైలు బ్రిడ్జి వైపు అప్‌స్ట్రీమ్‌లో ఎగువ వైపు 500 మీటర్లు, దిగువ ప్రాంతంలో 300 మీటర్ల వరకూ డ్రెడ్జింగ్ చేయకూడదు. ఎటువంటి ఇసుక తవ్వకాలు జరగకూడదు. ఇది నిబంధన. అంతేకాక గతంలో నిపుణుల కమిటీ కూడా ఇక్కడ ఇసుక తవ్వితే బ్రిడ్జిలకు ప్రమాదమని హెచ్చరించిన సంగతి తెలిసిందే. కానీ ఎక్కడా నిబంధనలు పాటించడంలేదు.



ఇష్టానుసారం తవ్వేస్తున్నారు..

గోదావరిలో ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. రాత్రీ పగలూ ఒకటే పని. ఇది ఏ ప్రమాదానికి దారితీస్తుందోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పైగా డ్రెడ్జింగ్ ఒక పద్ధతి ప్రకారం జరగాలి. పెద్ద డ్రెడ్జర్లతో పని జరగాలి. ప్రస్తుతం వందవరకూ డ్రెడ్జింగ్ బోట్లతో తవ్వేస్తున్నారు. ప్రభుత్వం ఒప్పందం పొందిన కాంట్రాక్టు సంస్థ ఇసుక తవ్వినా గామన్ బ్రిడ్జి అవతల అనుమతి లేదు. కానీ కాతేరు, వెంకటనగర్, తాళ్లపూడి వైపు ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. గామన్ బ్రిడ్జికి ఇవతల 800 మీటర్ల వరకూ తవ్వకూడదనే నిబంధన ఉంటే, సమీపంలోనే తవ్వేస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇటీవల గామన్ బ్రిడ్జి 52 పిల్లర్ వద్ద కొద్దిగా కుంగడంతో బేరింగ్‌లు దెబ్బతిన్నాయా? స్ప్రింగ్ దెబ్బతిందా?? అని ఆరా తీస్తూ ప్రస్తుతం కొవ్వూరు వైపు రాజమహేంద్రవరం వైపు వచ్చే బ్రిడ్జి ఎడమ వైపు వాహనాలు ఆపేశారు. రాజమహేంద్రవరం వైపు నుంచి కుడి వైపు సింగిల్ దారిలోనే వాహనాల రాకపోకలు అనుమతిస్తున్నారు. బ్రిడ్జి సడెన్‌గా కుంగిపోవడంతో ప్రస్తుతం ఇసుక అక్రమ తవ్వకాలు, డ్రెడ్జింగ్ కూడా చర్చనీయాంశమైంది. ఈ బ్రిడ్జి నిర్వహణ కూడా బాగా లేదు. టోల్ ప్లాజా ఎక్కువ డబ్బు మాత్రం గుంజేస్తున్నారు. దివాన్ చెరువు నుంచి కొవ్వూరు టోల్ ప్లాజా వరకూ రోడ్డు మధ్యలో గాళ్లు కింద ఏర్పడింది. తారు, ఇతర మెటీరియల్ అటూ ఇటూ జరిగిపోవడం వల్ల మధ్యలో లోతైన గాడి ఏర్పడింది. ఇలా అనేక గాడులు ఏర్పడ్డాయి. రోజూ వెళ్లేవాళ్లు జాగ్రత్తలు తీసుకున్నా, భారీ వాహనాలు వచ్చే సమయంలో వాహనాలు ఈ గోతులలో నుంచి పైకి ఎక్కి తప్పించుకునే అవకాశాలు తక్కువ. గత ఏడాది నుంచి ఇదే పరిస్థితి ఉన్నా, చిన్నచిన్న రిపేర్లు తప్ప ఈ రోడ్డును పట్టించుకోవడంలేదు.

నిబంధనలకు విరుద్ధం..

డ్రెడ్జింగ్ ఒప్పందం ప్రకారం ధవళేశ్వరం బ్యారేజి నుంచి గామన్ బ్రిడ్జికి 800 మీటర్ల లోపు వరకూ మొత్తం కోటి 70 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక డ్రెడ్జింగ్ చేయాలి. దీని కోసం క్యూబిక్ మీటరుకు రూ.155 వంతన ప్రభుత్వం సదరు కాంట్రాక్టు సంస్థకు చెల్లించాలి. అంటే మొత్తం రాజమహేంద్రవరం వైపు డ్రెడ్జింగ్ చేయడానికి రూ. 144 కోట్లు, కొవ్వూరు వైపు డ్రెడ్జింగ్ చేయడానికి రూ.124 కోట్ల కాంట్రాక్టర్‌కు ఇవ్వడానికి ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ఈ కాంట్రాక్టర్ పెద్ద డ్రెడ్జర్లు పెట్టి, ఇసుక తిప్పలు తొలగించి, ఇసుకను గోదావరి ఒడ్డున పోగు పెట్టాలి. దానిని వేరేవాళ్ల చేత ప్రభుత్వం అమ్మించి డబ్బు చేసుకుంటుంది. డ్రెడ్జింగ్ వల్ల గోదావరిలో నీటి నిల్వ శాతం పెరగాలనేది లక్ష్యం. కానీ ఇక్కడ ఎంత ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారో చెప్పడానికి కాంట్రాక్టర్ ఎవరూ కనిపించరు. డ్రెడ్జింగ్ చేసిన ఇసుక ప్రత్యేకంగా ఎక్కడా పోగులు పెట్టినట్టు లేదు. గతంలో డ్రెడ్జింగ్ చేసి వెంటనే అమ్మేసినట్టే ఇప్పుడూ జరుగు తోంది. అధికారికంగా డ్రెడ్జింగ్ చేసిన కాంట్రాక్టరు ప్రత్యేకంగా ఇసుక పోగు చేసి, ఇరిగేషన్ అధికార్లకు గానీ, ఏపీ ఎండీసీకి గానీ అప్పగించాలి. ఇక్కడ ఏమి జరుగుతుందో ఎవరూ స్పష్టత ఇవ్వడంలేదు. గతంలో బోట్స్‌మన్ సొసైటీ పేరిట వైసీపీ నేతలు నడుపుతున్న ర్యాంపులలో కూడా డ్రెడ్జింగ్ కొనసాగుతూనే ఉంది. గాయత్రి ర్యాంపులు, కోటిలింగాల ర్యాంపులు, కాతేరు, వెంకటనగర్ ర్యాంపులు, కొవ్వూరులో కూడా డ్రెడ్జింగ్ జరుగుతోంది.

అనపర్తి లొల్లి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సీటు బీజేపీకి కేటాయిస్తే మరింత రచ్చ..

ఇప్పటికే పార్టీ పదవులకు రాజీనామా చేసిన లీడర్లు

ప్రచారం ఆపేసి,ఇంటికే పరిమితమైన రామకృష్ణారెడ్డి

తీవ్ర ఆగ్రహంతో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

బలం లేని బీజేపీకి ఇస్తే టీడీపీలో ఉండలేమని ప్రకటన

క్యాడర్‌కు నచ్చచెబుతున్న సీనియర్ నేతలు

తెలుగుదేశం- జనసేన- బీజేపీ పొత్తు కుదుర్చుకుని మంచి జోష్‌లో ఉన్న సమయంలో అనపర్తి టికెట్ తలనొప్పిగా మారింది. టీడీపీ తొలి జాబితాలోనే అనపర్తి నుంచి టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరును ప్రకటించిన సంగతి తెలిసిందే. తర్వాతే బీజేపీతో టీడీపీ-జనసేనకు పొత్తు కుదరడంతో బీజేపీకి కొన్ని స్థానాలు ఇవ్వాల్సి వచ్చింది. అందులో జిల్లాలో ఇప్పటికే రాజమహేంద్రవరం లోక్‌సభను బీజేపీకి కేటాయించారు. అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి ఖరారయ్యారు. కానీ బీజేపీ మరో అసెంబ్లీ సీటు కోరడంతో పాటు అనపర్తిని అడగడంతో ఇప్పటికే అక్కడ టీడీపీ అభ్యర్థిగా ప్రచారంలో నిమగ్నమైన మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి ఇబ్బందిగా మారింది. కానీ ఇంతవరకూ తెలుగుదేశం పార్టీ నుంచి ఆయన సీటు మార్చుతున్నట్టు సమాచారం ఏమీ లేదు. దీంతో ఆయన ఇంతవరకూ ఏమీ పట్టించుకోకుండా ప్రచారం చేసుకుంటున్నారు. కానీ బీజేపీ అధినాయకత్వం తీసుకున్న అసెంబ్లీ స్థానాలలో అనపర్తి కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతుండడంతో పాటు అక్కడ రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజును పోటీ చేయమని అధిష్ఠానం చెబుతున్నట్టు కూడా ప్రచారం జరుగుతోంది. కానీ తాను అసెంబ్లీకి పోటీ చేయనని గతంలోనే స్పష్టం చేయడంతో పాటు, అధిష్ఠానం వద్ద కూడా చెప్పినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన కాదంటే అనపర్తి బీజేపీ ఇన్‌చార్జిగా ఉన్న మిలట్రీ కృష్ణంరాజు పేరును కూడా పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఆదే సమయంలో టీడీపీ అభ్యర్థి రామకృష్ణారెడ్డినే బీజేపీ అభ్యర్థిగా కూటమి తరఫున పోటీ పెట్టే ఆలోచన కూడా జరుగుతున్నట్టు సమాచారం. కానీ ఇక్కడ టీడీపీకే బలం ఉందని, బీజేపీకి అసలు బలం లేదని, అందువల్ల బీజేపీకి ఇస్తే తాము టీడీపీలో ఉండేలేమని రామకృష్ణారెడ్డి వర్గీయులు బహిరంగంగానే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నియోజకవర్గ స్థాయిలో పార్టీ రాష్ట్ర పదవులు, నియోజకవర్గ పదవులు ఉన్న నేతలంతా రాజీనామాలు చేసి, టీడీపీకి పంపించారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థే ఖరారైతే, రామకృష్ణారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగడానికి కూడా ఆయన అనుచరులు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. దీనితో కూటమికి ఈ సీటు పెద్ద తలనొప్పిగా మారింది.



నల్లమిల్లికే సీటు కేటాయించాలి

● లేకుంటే కఠిన నిర్ణయాలు ● టీడీపీ నేతలు

అనపర్తి, మార్చి 25: అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ సీటును ముందుగా ప్రకటించిన విధంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డిదేనని అధిష్ఠానం స్పష్టమైన ప్రకటన చేయాలని అనపర్తి నియోజకవర్గ టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని జోన్ 2 కార్యాలయానికి సోమవారం చేరుకున్న నియోజకవర్గ నాయకులు కోఆర్డినేటర్ మాజీ మంత్రి సుజయ కృష్ణ రంగారావును కలిసి సీటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సీటు రామకృష్ణారెడ్డికే ఉంటుందని కంగారు పడవద్దంటూ నాయకులను వారించారు. అయితే టీడీపీ నాయకులు అప్పటికే సిద్ధం చేసుకున్న పార్టీ పదవుల రాజీనామా పత్రాలను సుజయకృష్ణ రంగారావుకు అందజేశారు. అనపర్తి సీటు రామకృష్ణారెడ్డికి కేటాయిస్తేనే తాము రాజీనామాలను ఉపసంహరించుకుంటామని లేకుంటే సహాయ నిరాకరణ చేపడతామని అన్నారు. నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, జుత్తుగ కృష్ణ, వెలుగుబంటి సత్తిబాబు, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తమలంపూడి సుధాకరరెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సత్తి దేవ దానరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఆళ్ల గోవిందు, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటరామారెడ్డి పార్టీ పదవులకు రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందు మాట్లాడుతూ ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసి, 39 కేసులు పెట్టించుకుని, జైలుకు వెళ్లిన రామకృష్ణారెడ్డిని కాదని బీజేపీకి సీటు ఎందుకు కేటాయిస్తారో చెప్పాలని అన్నారు. జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్ని విషయాలు తెలిసిన చంద్రబాబు మౌనం వీడి అనపర్తి సీటుపై క్లారిటీ ఇవ్వాలని అన్నారు.



రాజీనామా పత్రాలను సమర్పిస్తున్న నేతలు



25 శాతం కమీషన్ అంటూ కరపత్రాలు హల్‌చల్

ఎంపీ భరత్ అవినీతిపై పోస్టర్లు ప్రత్యక్షం

సోషల్ మీడియాలోనూ వైరల్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25: రాజమహేంద్రవరంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్ లవ్ 25 శాతం కమిషన్ క్యాప్షన్‌తో కొన్ని ప్రాంతాల్లో కరపత్రాలు హల్‌చల్ చేస్తున్నాయి. రాజమహేంద్రవరం ఎంపీగా పని చేసిన భరత్ తన పదవి కాలంలో ఏఏ పనులకు 25 శాతం కమిషన్ తీసుకున్నారో వివరిస్తూ రూపొందించిన ఈ కరపత్రాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. భరత్ రామ్ మునిసిపల్ కాంట్రాక్టులలోను, ఈట్ స్ట్రీట్ ఏర్పాటులోను, కంబాలచెరువు పార్కు అభివృద్ధి పేరుతోను, సుబ్రహ్మణ్య మైదానం అభివృద్ధి పేరుతోను, ఇసుక అక్రమ రవాణాలోను, ఆవ భూములు, గ్రావెల్, గ్రానైట్, మాదక ద్రవ్యాల ఎగుమతులలోను భరత్ 25 శాతం కమిషన్ తీసుకున్నారనే అర్థం వచ్చేలా ఈ కరపత్రాలు దర్శనమిస్తున్నాయి. దీంతో కొంతమంది ఈ కరపత్రాలను సోషల్ మీడియాలో సైతం వైరల్ చేస్తున్నారు.

28న కొవ్వూరులో దివ్యాంగుల సదరం శిబిరం

6లో

సమగ్రశిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి

అనపర్తి టీడీపీలో పలువురి రాజీనామా

వార్త..6లో

ఎలా జరిగింది?

గామన్‌బ్రిడ్జిపై రెండో రోజు వాహన రాకపోకలు నిలుపుదల

కుంగిన ప్రాంతాన్ని పరిశీలించిన ఆర్‌డీసీ అధికారులు



బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికార బృందం

ఓ వైపు వాహనాల నిలుపుదల

కొవ్వూరు, మార్చి 25: కొవ్వూరు రాజమహేంద్రవరం మధ్య అఖండ గోదావరి నదిపై ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ నిర్మించిన నాలుగులైన్ల గామన్ వంతెన కుంగడంతో కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలో వాహన రాకపోకలను రెండో రోజు కూడా పూర్తిగా నిలుపుదల చేశారు. రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వైపు వచ్చే మార్గంలో మాత్రమే రెండు వైపులా వాహన రాకపోకలను అనుమతిస్తున్నారు. బ్రిడ్జిపై కుంగిన ప్రాంతాన్ని రోడ్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ (ఆర్‌డీసీ) అధికారులు సోమవారం పరిశీలించారు. వంతెనపై 50 నుంచి 53వ స్తంభం వరకు అధికారుల బృందం పరిశీలన చేపట్టింది. 50 నుంచి 53వ స్తంభాల మధ్య వాహనాలు రాకపోకల సమయంలో వైబ్రేషన్ అధికంగా రావడాన్ని గమనించిన గామన్ బ్రిడ్జి టోల్‌గేట్ నిర్వహణ సిబ్బంది ముందస్తు జాగ్రత్త చర్యగా ఆదివారం సాయంత్రం నుంచి వంతెనపై మరమ్మతులకు గురైన భాగంలో రాకపోకలు నిలుపుదల చేశారు. ఆర్‌డీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంత్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బి.ఏ వర్మ, కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. గామన్ వంతెనను 2007 సంవత్సరంలో సుమారు రూ.808 కోట్లతో నిర్మాణం ప్రారంభించారు. 2015 గోదావరి మహా పుష్కరాల సమయంలో కొవ్వూరు, రాజమహేంద్రవరంలకు గోదావరి పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అప్పటి ప్రభుత్వం హడావుడిగా వంతెనపై రాకపోకలను ప్రారంభించింది. అప్పటినుంచి రోజుకు సగటున 20 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు కం రైలు బ్రిడ్జిపై భారీ వాహనాలను పూర్తిగా నిషేధించడంతో గామన్ వంతెనపై రాకపోకలు పెరిగాయి. ప్రస్తుతం వంతెన ఓ భాగంలో కుంగడంతో ఒకవైపు మాత్రమే వాహనాలను అనుమతించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వాహనాలు ఓవర్ లోడ్‌తో రాకపోకలు సాగించడంతో వంతెన జాయింట్ల వద్ద యాక్షన్ బేరింగ్‌లు దెబ్బతినడం గాని, స్ప్రింగ్స్ కట్ అవ్వడం గాని జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు. మరోవైపు వంతెనకు ఆనుకుని గోదావరి నదిలో యంత్రాలతో డ్రెడ్జింగ్ చేపట్టి ఇసుక తవ్వకాలు చేపట్టడం ఓ కారణంగా భావిస్తున్నారు. ఆర్‌డీసీ ఈఈ శ్రీకాంత్ మాట్లాడుతూ గామన్ వంతెనపై కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలో 52వ స్తంభం వద్ద అధికంగా వైబ్రేషన్స్ రావడంతో ముందస్తు జాగ్రత్త చర్యగా వంతెనపై ఒకవైపు రాకపోకలు నిలుపుదల చేసినట్లు చెప్పారు. బ్రిడ్జి స్ట్రక్చర్‌కు ఎటువంటి ప్రమాదం లేదని భారీ వాహనాల రాకపోకలతో జాయింట్ల వద్ద యాక్షన్ బేరింగులు దెబ్బతిని ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. హైదరాబాద్ నుంచి నిపుణులు బృందం వస్తుందని వారు వంతెనను పరిశీలించి సమస్య ఉన్నట్లయితే మరమ్మత్తులు చేపట్టి వాహన రాకపోకలను అనుమతిస్తామన్నారు.

28న కొవ్వూరులో దివ్యాంగుల సదరం శిబిరం

సమగ్రశిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి



కొవ్వూరు, మార్చి 25: కొవ్వూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 28న దివ్యాంగుల వైకల్య నిర్ధారణ పరీక్షా శిబిరం ఏర్పాటు చేసినట్టు సమగ్రశిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఈ శిబిరంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఉపకరణాలు అందజేస్తారన్నారు. శిబిరానికి హాజరైన దివ్యాంగ పిల్లలకు ఉచిత భోజనం, రవాణా చార్జీలు అందిస్తారన్నారు. కొవ్వూరు, నల్లజర్ల, గోపాలపురం, తాళ్లపూడి, దేవరపల్లి మండలాల దివ్యాంగుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముత్యాల అలంకరణలో బాలాత్రిపుర సుందరి



కొవ్వూరు, మార్చి 25: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో ఫాల్గుణ మాస పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయార్చకులు అమ్మవారిని ముత్యాలతో అలంకరించి మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు

కొవ్వూరు/ఉండ్రాజవరం, మార్చి 25: హోలీ పండుగను ఉండ్రాజవరంతో పాటు కొవ్వూరు పట్టణ, మండలంలో పెద్దలు, చిన్నలు ఆనందోత్సాలతో వేడుకగా జరుపుకున్నారు. చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు పూసుకుంటు ఆనందంగా గడిపారు. వీధుల్లో చిన్నారుల రంగులు కలిపి వాటర్ బాటిళ్లతో చేసిన హడావిడి ఆకట్టుకున్నాయి. కాగా దీపావళి తరువాత దేశంలో అత్యంత వేడుకగా చేసుకునే పండుగ హోలీ.

సీపీఐ నాయకుడు భోగవల్లికి నివాళి



భోగవల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెరవలి, మార్చి 25: సీపీఐ నాయకుడు భోగవల్లి నరసింహమూర్తి (దత్తుడు) సంస్మరణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన స్వగృహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కోనాల భీమారావు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఆశయ సాధనే లక్ష్యంగా రైతులు, వ్యవసాయ కార్మికులు అభ్యున్నతికి, దేవదాయ ధర్మాదాయ కౌలు రైతుల సమస్యలు పరిష్కారానికి ఆయన కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు వెంకటేశ్వరరావు, చంటి బాబులకు సానుభూతి తెలిపారు. నరసింహమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నామన వెంకటేశ్వరరావు, పంతం నాగేశ్వరరావు, లైబ్రేరి బాబ్జి, గుత్తుల మహాలక్ష్మి పాల్గొన్నారు.

మదనగోపాలస్వామికి పూజలు

ఉండ్రాజవరం, మార్చి 25: మండలంలోని తాడిపర్రులో మదన గోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి విష్ణు సహస్రనామ పారాయణం, రాత్రి పుష్పయాగోత్సవం నిర్వహించారు. ఉండ్రాజవరంలో పౌర్ణమి సందర్భంగా బాలాత్రిపుర సుందరి సమేత గోకర్ణేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్ర నామ పారాయణ, కుంకుమ పూజలు జరిపారు.

ఘనంగా లక్ష్మీ జయంతి



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

తాళ్లపూడి, మార్చి 25: లక్ష్మీ జయంతి సందర్భంగా తాళ్లపూడిలో శ్రీరాజ్యలక్ష్మి ఆలయంలో సోమవారం లక్ష్మీనారాయణుల కల్యాణం, అభిషేకాలు, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మహిళలతో కుంకుమ పూజలు జరిపారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి జన్మనక్షత్ర వేడుకలు



నల్లజర్ల, మార్చి 25: అనంతపల్లిలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం జన్మ నక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు విఘ్నేశ్వరపూజ, అభిషేకాలు చేశారు. నామ సంకీర్తన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం శంకర శ్రీనుబాబు దంపతులు ప్రసాదవితరణ చేశారు. అలాగే పోతవరం అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్రంలో 'మానవత' సేవా కార్యక్రమాలు



చాగల్లు సమావేశంలో మాట్లాడుతున్న రాధా పుష్పావతి

చాగల్లు, మార్చి 25: రాష్ట్ర వ్యాప్తంగా 112 యూనిట్లతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు మానవత సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్లు డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి, బలుసు సత్యనారాయణ తెలిపారు. సంస్థ నూతన కమిటీ ఏర్పాటు కోసం చాగల్లులోని పాటెమ్మ ఆలయం వద్ద జరిగిన సన్నాహక సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ కొండేపు సూర్యనారాయణ, జుజ్జువరపు వెంకట కృష్ణ ప్రసాద్, కొఠారు శ్రీనివాస్, శ్రీకాకుళం ఆంజనేయులు పాల్గొన్నారు. 9 మంది సభ్యులతో ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేశారు.

చివటంలో కామ దహనం



చివటంలో కామ దహనం దృశ్యం

ఉండ్రాజవరం, మార్చి 25: మండలంలోని చివటం గ్రామంలో ఆదివారం రాత్రి కామ దహనం(కలప చెక్క వస్తువులు) కార్యక్రమం నిర్వహించారు. పూర్వం వేసవి కాలంలో గ్రామంలో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగతుండేవి. వీటిని అరికట్టేందుకు అగ్ని దేవునికి మొక్కుబడిగా తమకు అక్కరకు రాని కలప, చెక్క వస్తువులు మంటలో వేసి దహనం చేయడంతో అగ్నిప్రమాదాలు ఆగిపోయాయని, అప్పటి నుంచి ప్రతి ఏటా హోళీ పౌర్ణమి రోజున ఈ కామదహనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్థానికులు చెప్పారు. గ్రామ ప్రధాన కూడలిలో రావిచెట్టు కొమ్మను పాతిపెట్టి కొమ్మ చుట్టు ఊరేగింపు జరిపి చెక్క వస్తువులు వేసి దహనం చేశారు. కార్యక్రమాన్ని గ్రామస్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాల వారు వచ్చి తిలకించారు.

వేణుగోపాలస్వామి శ్రీపుష్పయాగం

బిక్కవోలు, మార్చి 25: కొంకుదురులోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి శ్రీపుష్పయాగం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అర్చకులు అంగర శ్రీదర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పూలతో అలంకరించిన శ్రీపుష్ప యాగ పల్లకి అందర్నీ ఆకర్షించింది. భక్తులందరూ స్వీట్లు, పూలను స్వామి అమ్మవార్లకు కానుకలుగా సమర్పించారు.

దుర్మార్గ పాలనను అంతమొందించాలి

» రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

» వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే పవన్ పోరాటం

» టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గేష్

» కడియంలో టీడీపీ-జనసేన ఆత్మీయ సమావేశం



నిడదవోలు: కంసాలిపాలెంలో సమావేశంలో పాల్గొన్న దుర్గేష్, శేషారావు

కడియం, మార్చి 25: రాష్ట్రంలో దుర్మార్గపు వైసీపీ పాలనను అంతమొందించడానికి సమష్టిగా ముందుకెళదామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కడియంలోని జీఎస్ఆర్ కన్వెన్షన్‌లో సోమవారం జరిగిన జనసేన-టీడీపీ ఆత్మీయ సమావేశానికి గోరంట్లతోపాటు టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి కందుల లక్ష్మీదుర్గేష్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. రెండు చోట్లా తమ విజయం తథ్యమని వారిద్దరూ అన్నారు. ఈ సందర్భంగా తొలుత దుర్గేష్ రూరల్ జనసైనికులతో మాట్లాడారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ తన వెంట ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మంచి పాలన అందాలని, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావాలని, దుర్మార్గపు పాలన అంతమొందించడానికి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశ్యంతో ఈ కూటమిలో కీలకంగా వ్యవహరిస్తూ తనను నిడదవోలు పంపారన్నారు. పొత్తు ధర్మంలో భాగంగా ఇక్కడ ఉమ్మడి అభ్యర్థి గోరంట్లను అఖండ మెజారిటీతో గెలిపించాలనిజనసైనికులకు దుర్గేష్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ దుర్గేష్ మంచి రాజకీయ విలువలున్న నాయకుడన్నారు. అక్కడ దుర్గేష్, ఇక్కడ తాను అత్యధిక మెజారిటీతో గెలుపొంది శాసనసభలో అడుగు పెడతామన్నారు. టీడీపీ హయాంలో నర్సరీ రైతుల శ్రేయస్సుకు కృషి చేశామన్నారు. అన్ని వర్గాలు ఐకమత్యంతో మెలిగి కూటమి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కడియం, రూరల్ మండలాల జనసేన, టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలు మండలం కంసాలిపాలెంలో జరిగిన టీడీపీ-జనసేన-బీజేపీ ఆత్మీయ సమావేశానికి కందుల దుర్గేష్ విచ్చేసి మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే మూడు పార్టీలు కలసి వస్తున్నాయని, నియోజకవర్గ ప్రజలంతా గ్లాసు గుర్తుపై ఓటు వేసి అఖండ విజయం చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ భోగవల్లి ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలగన సూర్యారావు, మూడు పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిస్థితులు సర్దుకున్నాక కలుద్దామనుకున్న: గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్ నుంచి నిడదవోలు వెళ్ళిన దుర్గేష్‌కు అక్కడ పరిస్థితులు సర్దుకున్న తరువాతే జనసైనికులను కలుద్దామని ఉద్దేశ్యంతో ఇప్పటి వరకు తాను వేచి ఉన్నానని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. దుర్గేష్ వచ్చి సమావేశం నిర్వహించిన తరువాత జనసైనికులను కలుస్తామని చెప్పడం జరిగిందని, అందుకే జాప్యం జరిగిందన్నారు. తన వద్ద గ్రూపులు, వర్గాలు ఉండవని, అందర్ని కలుపుకొని వెళ్ళడమే తన లక్ష్యం అన్నారు. కాపుల కోసం ఏమీ చేయని కాపు ఉద్యమ నాయకుడు ప్రభుత్వానికి కొమ్ము కాస్తున్నారన్నారు. రానున్న కాలంలో పవన్‌కళ్యాణ్‌కు ఎంతో భవిష్యత్తు ఉందన్నారు. సొంత నాయకులే తరిమేసిన నాయకుడు రాజమహేంద్రవరం రూరల్‌లో పోటీకి వచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి, దేశంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.



కడియంలో ఐక్యత అభివాదం చేస్తున్న దుర్గేష్, గోరంట్ల

రాష్ట్రంలో రాక్షస పాలన

» టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి



ప్రక్కిలంక సమావేశంలో మట్లాడుతున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్ళపూడి, మార్చి 25: రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని, మైనింగ్, ఇసుక, భూముల దందాలు నడిపిన ఘనత జగన్‌కే దక్కుతుందని టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పైడిమెట్ట, రాగోలపల్లి, అన్నదేవరపేట, ప్రక్కిలంక, తాళ్ళపూడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాల్లో నాయకులను, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిని, చెల్లినే సరిగా చూడని జగన్ రాష్ట్రంలోని మహిళలను ఏం గౌరవిస్తారన్నారు. కాపులకు కార్పోరేషన్ పెట్టిన ఘనత టీడీపీదేనన్నారు. రాష్ట్రం బాగుండాలంటే మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. అన్నదేవరపేటలో వైసీపీ నాయకుడు ఇంజరపు వెంకటకృష్ణ(అబ్బులు)టీడీపీలో చేరారు. ఆయనకు ముప్పిడి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమని రామకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, బీజేపీ మండలాధ్యక్షుడు ఎండుగుల రామకృష్ణ, మాజీ ఎంపీపీ కొప్పాక కోటీస్, చలపాటి ప్రకాష్, అల్లూరి విక్రమాదిత్య, కొటారు వెంకట్రావు, కూచిపూడి గణపతి, రోజారాణి, నాయుడు హనుమంతరావు, నామన పరమేశ్వరరావు, బీజేపీ నాయకులు కొండేపాటి సత్యనారాయణ, సత్యం, జనసేన నాయకులు ఆయితం మణికంఠ, బరిగంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని మాదకద్రవ్యాంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్

» టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి, మార్చి 25: ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు విమర్శించారు. సోమవారం దేవరపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ అరాచకాలను వివరించి టీడీపీ సూపర్ 6 పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో యువత మాదకద్రవ్యాలకు బానిసలయ్యారని, విచ్చలవిడిగా గంజాయి, మత్తు పదార్థాలను యథేచ్ఛగా వాడుతున్నారన్నారు. విశాఖపట్నంలో పట్టుబడిన మాదకద్రవ్యాలకు మూలాలు ఎవరివో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను ప్రతిపక్షాలపై రుద్దడం అలవాటన్నారు. స్థానిక వినాయక, సుబ్రహ్మణ్యస్వామి, రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆంద్రూ అనీల్, గన్నమని హరికృష్ణ, వెంకటేశ్వరరావు, రాంబాబు, పెనుమత్స సుబ్బరాజు, జనసేన నాయకులు అనిశెట్టి గంగరాజు, కంబాల సత్తిబాబు, బీజేపీ నాయకులు వెంకటపతిరాజు, కోలా రామకృష్ణ పాల్గొన్నారు



దేవరపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మద్దిపాటి వెంకట్రాజు

ప్రజలు సుఖశాంతులతో ఉండాలి

ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు



నిర్మలగిరిలో దివ్య బలిపూజ చేస్తున్న ఏలూరు పీఠాధిపతి, ఫాదర్లు

దేవరపల్లి, మార్చి 25: ప్రపంచంలోని ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, మరియమ్మతల్లి దీవెనలు అన్ని వర్గాల ప్రజలకు కలుగుతాయని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. మండలంలోని గౌరీపట్నంలో నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్మలగిరికి విచ్చేసిన జయరావుకు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, ఫాదర్లు స్వాగతం పలికారు. ఆయన నిర్మలగిరి మందిరం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తుల నుంచి దివ్యబలిపూజలు ఆశీర్వచనాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుణ్యక్షేత్రానికి కులమతాలకు అతీతంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మేరీమాతను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకోవడం ఆనందకరమన్నారు. పుణ్యక్షేత్రానికి వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. కార్యక్రమంలో ఫాదర్లు ఆరోణు, మోజేష్, బాలరాజు, ఇమ్మానియేలు, ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



దేవరపల్లి, మార్చి 25: మండలం యర్నగూడెంలో శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరిగింది. టీటీడీ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాజలాన్ని 108 మంది కలశాలతో తీసుకొచ్చి అభిషేకం చేశారు. సిద్ధాంతి రావిపాటి వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణకర్త శ్రీకాకుళలపు కాశీవిశ్వనాథం, రోహిణి దంపతులు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కన్నుల పండువగా నరసన్న శ్రీ పుష్పయాగం



స్వామివారిని ద్వాదశ ప్రదక్షిణలు చేయిస్తున్న దృశ్యం

కోరుకొండ, మార్చి 25: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు(5 రోజులు) ముగిసిన తర్వాత ఆరో రోజు సోమవారం రాత్రి స్వామి వారికి పర్యాంగ సయనోత్సవం(శ్రీ పుష్పయాగం) కన్నుల పండువగా జరిగింది. ఆలయ అనువంశక ధర్మకర్త పరాసర రంగ రాజ భట్టర్, అన్నవరం దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు, పెద్దింటి, పెదపాటి, పెరవళి, అనువంశక అర్చకస్వాములు శ్రీ పుష్పయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేక పల్లకిలో ఆశీనులను చేసి ఆలయం చుట్టూ ద్వాదశ ప్రదక్షిణలు చేయించారు. ఈ సందర్భంలో స్వామికి 11 రకాల పండ్లు, పుష్పాలతో నివేదన చేశారు. అనంతరం 12 రకాల ఆహార పదార్థాలతో 12 నివేదనలు సమర్పించారు. కార్యక్రమంలో కోరుకొండ పరిసర ప్రాంతాల భక్తులు, ధర్మకర్తలు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ పదవులకు 22 మంది రాజీనామా

అనపర్తి సీటు మారిస్తే సహాయ నిరాకరణకు సిద్ధమంటూ ప్రకటన



అనపర్తి, మార్చి 25: అనపర్తి అసెంబ్లీ సీటును పొత్తుల్లో భాగంగా బీజేపీకి కేటాయిస్తున్నారంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో అనపర్తిలో టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. అధిష్ఠానం స్పష్టమైన ప్రకటన చేయాలని అనపర్తి సీటు టీడీపీ నాయకుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డికేనని అధిష్ఠానం ప్రకటన చేయాలంటూ ఆదివారం పార్టీ నాయకులు డిమాండ్ చేసినప్పటికీ అధిష్ఠానం నుంచి స్పష్టత రాకపోవడంతో సోమవారం నియోజ కవర్గంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులతో బాటు జిల్లా, రాష్ట్ర కమిటీల్లో పొందిన పదవులకు సుమారు 22 మంది రాజీనామాలు చేశారు. రాజీనామా లేఖలను రాజమహేంద్రవరంలోని టీడీపీ జోన్-2 కార్యాలయంలో కోఆర్డినేటర్ సుజయ్ కృష్ణ రంగారావుకు అందజేశారు. అనపర్తి టికెట్ ముందుగా ప్రకటించిన విధంగా టీడీపీకే ఇవ్వాలని అలా కాకుండా మార్పు చేస్తే వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ నాయకులు శ్రేణులు సహాయ నిరాకరణ చేపడతామని వారు పేర్కొన్నారు.

కంసాలిపాలెంలో 20 మద్యం సీసాలు స్వాధీనం

నిడదవోలు, మార్చి 25: నిడదవోలు మండలం కంసాలిపాలెం గ్రామానికి చెందిన అవిటి గౌతమి నుంచి అక్రమంగా నిల్వ ఉంచిన 20 మద్యం సీసాలను సమిశ్రగూడెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ఆవిష్కరణ



మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.పద్మశ్రీ ఆవిష్కరించారు. స్థానిక వై.జంక్షన్ ఆనం రోటరీ హాలులో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఏడు నియోజకవర్గాల నాయకులు అత్యవసర సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శులు ముళ్ళ మాధవ్, బోడా వెంకట్, బాలేపల్లి మురళీధర్, అధికార ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాసరావు, డాక్టర్ వడయార్, మార్టిన్ లూథర్, నలబాటి శ్యామ్, కిషోర్ కుమార్ జైన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలు అమలు కావాలంటే కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఐదు అద్భుతమైన పథకాలతో మేనిఫెస్టోను రూపకల్పన చేశారని, దానిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. సమావేశంలో రౌతు విజయలక్ష్మి, శారద, పార్వతి, వివిధ ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.

జీడి గింజలకు మద్దతుధర ప్రకటించాలి

బీజేపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు అర్జున్

దివాన్‌చెరువు, మార్చి 25: ప్రభుత్వం జీడిమామిడి గింజలకు మద్దతు ధర ప్రకటించాలని బీజేపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు దొడ్డా అర్జున్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జీడి గింజలను ప్రభుత్వం కొనుగోలు చేయకపోగా కనీసం మద్దతు ధరనైనా ప్రకటించడం లేదన్నారు. కమీషనుదార్లే వీటిని కొనుగోలు చేస్తున్నారని, దీంతో సీజన్‌లో సరైన ధర పలకక రైతులు నష్టపోతున్నారని వాపోయారు. త్వరలో సీజను ప్రారంభం కానున్నందున 80కిలోల బస్తాకు కనీసం రూ.10 వేలైనా మద్దతు ధరగా నిర్ణయించాలని సూచించారు. అలాగే ఈ జీడిగింజలను రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు.

ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలి

» ఇప్పటి వరకు 265 మందిపై బైండోవర్ కేసులు

» కోరుకొండ నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీనివాసరావు



కోరుకొండ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కోరుకొండ, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ విడుదల చేసిన నియమావళిని అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు కచ్చితంగా పాటించాలని నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. కోరుకొండ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 265 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.1లక్ష పూచీ కత్తుపై తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. నియోజకవర్గ సరిహద్దు ప్రాంతాలైన గోకవరం, రాజానగరం వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.12లక్షలు విలువైన 4వేల లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. 37వేల లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశామన్నారు. 477 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని బెల్ట్‌షాపులపై కేసులు నమోదు చేశామన్నారు. కోరుకొండ నార్త్‌జోన్ పరిధిలో 109కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 14 మందిని అరెస్ట్ చేశామన్నారు. ఐదు కేసులు నమోదు చేశామన్నారు. ప్రతి ప్రాంతంలో ఉన్నతాధికారుల సారథ్యంలో ప్రత్యేక పోలీస్ దళాలు, స్పెషల్ స్క్వాడ్‌లు, మఫ్టీ పోలీసులతో నిఘా పెట్టామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనే అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలన్నారు. ఓటర్లు ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో కోరుకొండ సీఐ అడపా నాగమురళీ, రాజానగరం సీఐ పి.కాశీ విశ్వనాథం, ఎస్.ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

కొవ్వూరు, మార్చి 25: పేకాట స్థావరంపై దాడిచేసి ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. కొవ్వూరు మండలం మద్దూరులో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడిచేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్టుచేసి వారి నుంచి రూ.13570 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

త్యాగరాజ సంగీతోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 25: శ్రీ త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత వార్షికోత్సవాలు ఏడో రోజు సోమవారం కొనసాగాయి. వేలూరి తులసి విశ్వనాథ్ (గాత్రం), చిరంజీవి వేలూరి నీరజ (గాత్ర సహకారం) పెరవలి నందకుమార్ (వయోలిన్), పెరవలి జయభాస్కర్ (మృదంగం), సరస్వతుల హనుమంతరావు (ఘటం) బృందం శ్రోతలకు వీనులవిందుగా ఆలపించారు. సంగీత ప్రియులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

శ్రీ చైతన్య మహాప్రభు ఆవిర్భావ మహోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి25: స్థానిక ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో శ్రీ చైతన్య మహాప్రభు ఆవిర్భావ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం నగర సంకీర్తన, భక్తి కంకణ వన మహరాజ్ ప్రవ చనం, పంచామృత ఫల పుష్పాలతో స్వామి వారికి మహాభిషేకం జరిగాయి. భోగి మంటలు వేశారు. 108 పిండి వంటలతో మహారాజ భోగం నిర్వహించారు. హారతి అనంతరం ఘనంగా హోలీ వేడుకలు జరిపారు. ఏర్పాట్లను ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాసు బ్రహ్మచారి పర్యవేక్షించారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	కుంగ్‌ఫూ పాండా..
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	ఓం బీం బుష్
అనన్య	భీమా

నిడదవోలు

వీ మ్యాక్స్	ప్రేమలు
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	ఓం బీం బుష్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గామి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	భీమా

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి